
లింగసముద్రం : రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

'సోమశిల'కు కొనసాగుతున్న ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 35,600 క్యూసెక్కులు ఉండగా మంగళవారం నాటికి 41 వేల క్యూసెక్కులకు పెరిగినట్లు ఇంజనీర్లు తెలిపారు. దిగువకు గేట్ల ద్వారా 33,460 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 67.279 టీఎంసీలు నిల్వ ఉండగా, పెన్నా క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురుస్తుండటంతో వచ్చే ప్రవాహం పెరిగే అవకాశం ఉంది.

● 'కండలేరు'లో 58.74 టీఎంసీలు

రాపూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాంకు వరద ప్రవాహం కొనసాగుతంఓది. జలాశయం సామర్థ్యం 68.03 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 10,600 క్యూసెక్కులుగా నమోదైంది. హెడ్ రెగ్యులేటర్ నుంచి 1450 క్యూసెక్కులు, సత్యసాయి కాలువకు 600, పిన్నేరు వాగుకు 1700, ఫస్ట్ బ్రాంచ్ కాలువకు 5, రాపూరు తాగు నీటి పథకానికి 5 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

● 'రాళ్లపాడు'లో 4 గేట్ల ఎత్తివేత

లింగసముద్రం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : 'మొంథా' ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి వరద ప్రవాహం వస్తోంది. ప్రాజెక్టులోకి 10,500 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో డీఈలు ఎం వెంకటేశ్వర్లు, పి శేషయ్య, ఏఈ మనోహర్‌లు మంగళవారం ప్రాజెక్టు కొత్త స్పిల్‌వేలోని నాలుగు గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 18,500 క్యూసెక్కుల నీటిని మన్నేరుకు విడుదల చేశారు. అయితే ప్రాజెక్టులో వచ్చే ప్రవాహాన్ని బట్టి మన్నేరుకు నీటిని విడుదల చేస్తామని డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రాజెక్టులో 18.6 అడుగల నీటిమట్టం ఉంది.

● 'గండిపాళెం'లో 12 అడుగులకు..

ఉదయగిరి : గండిపాళెం జలాశయం నీటిమట్టం 35 అడుగులు కాగా, 12 అడుగులకు నీరు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి పేర్కొన్నారు. ఫైతట్టు ప్రాంతాల్లో దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో 420 క్యూసెక్కుల నీటి ప్రవాహం జలాశయంలోకి వస్తున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున జలాశయం నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశముందని ఆయన తెలిపారు.


కందుకూరులో పేదలను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న పోలీసులు

● ఉదయగిరి రూరల్ (వరికుంటపాడు) : నక్కలగండి జలాశయం జలకళను సంతరించుకుంది. జలాశయ సామర్థ్యం 22 అడుగులు కాగా ఇప్పటివరకు 19 అడుగుల మేర నీరు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ రమేష్ తెలిపారు. ప్రస్తుతం వరద కొనసాగుతుండటంతో బుధవారం అలుగు పారే అవకాశం ఉంది.

పొట్టేళ్లవాగులో వృద్ధురాలి గల్లంతు

మనుబోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మనుబోలు మండలం గొట్లపాళెం వద్ద పొట్టేళ్లవాగు ఉధృతికి మంగళవారం అదే గ్రామానికి చెందిన కిష్టమ్మనేని జయమ్మ(65) గల్లంతైంది. గ్రామంలోని రేషన్ డీలర్ మురళి తల్లి జయమ్మ నిత్యం వాగుదాటి పశువుల మేపేందుకు వెళుతుంది. రోజూలాగే మంగళవారం ఉదయం వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చే క్రమంలో వాగు ప్రవాహంలో కొట్టుకుపోయింది. సమీప పశువుల కాపరులు గుర్తించి గ్రామంలో సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు వాగువద్దకు చేరుకుని జయమ్మ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


నెల్లూరు : తల్పగిరి కాలనీలో వర్షపు నీరు


కావలి : వర్షపు నీటి మునకలో అన్నపుగుంట ప్రాంతం

మరో 36 గంటలు.. భారీ వర్షం

● జిల్లాపై మొంథా ఎఫెక్ట్ ● రోజంతా వర్షం
● పొంగి పొరలుతున్న వాగులు, వంకలు
● లోతట్టు ప్రాంతాల జలమయం
● పరిస్థితిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారుల బృందం

మొంథా తుఫాన్ తీరం దాటినా మరో 36 గంటలపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మరోవైపు తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురవడం మినహా జిల్లాలో మరెలాంటి నష్టం సంభవించలేదు. ఈదురుగాలుల ప్రభావం కూడా చాలా తక్కువగా కనిపించింది. తీర ప్రాంతాల్లో మాత్రం సముద్రం అల్లకల్లోలంగా కనిపించడంతో సరిసర ప్రాంత ప్రజలు హడలిపోయారు. కృష్ణపట్నం ఓడరేవులో 8వ నంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు.

● 12 మండలాల్లో 40 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో లోతట్టుప్రాంతాలు, తీరప్రాంతాలలోని 2,300 మందిని ఈ కేంద్రాలకు తరలించారు.

● భారీ వర్షాల కారణంగా 450 కి.మీ పొడవున ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. పది కల్వర్టులు దెబ్బతినగా, నాలుగు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు పారుతోంది. సుమారు రూ.19 కోట్ల మేర ఆర్‌అండ్‌బీ శాఖకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

- పూర్తి వివరాలు 8లో..

పంట నష్టం ఇలా..

నెల్లూరు (సాంస్కృతికం) : తుఫాన్ కారణంగా జిల్లాలో దాదాపుగా 3249.25 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు మంగళవారం సాయంత్రానికి వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. 326.5 ఎకరాల్లో చేతికొచ్చిన వరి పైరు, 10 ఎకరాల్లో సజ్జ, 4.25 ఎకరాల్లో మొక్కజొన్న, 28.5ఎకరాల్లో వేరుశనగ దెబ్బతిన్నాయి. మొత్తంగా 16 మండలాల్లో 48 గ్రామాలకు చెందిన 1141 మంది రైతులు చెందిన పంటలు దెబ్బతిన్నట్లుగా వ్యవసాయ శాఖ తెలిపింది.


మనుబోలు : నీటమునిగిన సంగమేశ్వర ఆలయం


ఉదయగిరిలో దెబ్బతిన్న వరిపైరు


అల్లూరులో ఈదురుగాలులు..

విద్యాసంస్థలకు నేడు కూడా సెలవు

నెల్లూరు (విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బుధవారం కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్తర్వులను ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు విధిగా అమలు చేయాలని డీఈఓ బాలాజీరావు, ఆర్‌ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో జాగ్రత్తలు తీసుకోండి

● జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి ఎన్.యువరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మండల అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాల్లో వసతుల గురించి అధికారులతోపాటు ఆశ్రయం పొందుతున్న వారితో నేరుగా మాట్లాడారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ చెరువులకు గండి పడే అవకాశం ఉంటే పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పూర్తిగా నిండిన చెరువుల వద్ద పోలీసు, రెవెన్యూ అధికారులు గస్తీ ఉంటూ సమీప గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పొరుగు జిల్లాల నుంచి మన ప్రాజెక్టులకు వస్తున్న వరద నీటిని అంచనా వేసి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా వ్యవహరించండి : సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం అన్ని శాఖల అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. గిరిజన కాలనీ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన సదుపాయాలు కల్పించాలన్నారు. మిగతా ప్రాంతాల్లోనూ ఇబ్బందులున్న పరిస్థితులలో ప్రజలను సురక్షిత

పీహెచ్‌సీ పరిశీలన

ఇందుకూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగదేవిపేట ఆరోగ్య కేంద్రాన్ని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలీ మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుధాకర్‌రావు, హెచ్‌ఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11266
వెండి కిలో ధర	రూ. 145300
వెండి ఒక గ్రాము	రూ. 151.30

ఒకటే వాన...

● స్తంభించిన జన జీవనం ● పునరావాస కేంద్రాల ఏర్పాటు ● అధికారుల పర్యవేక్షణ

మొంథా తుఫాన్ ప్రభావంతో కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో మంగళవారం రోజంతా వాన కురుస్తూనే ఉంది. ఎడతెరపి లేని వర్షంతో జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లపై, వీధుల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బం దులు ఏర్పడ్డాయి. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసింది. ప్రజలను వాటికి తరలించి ఏర్పాట్లు చేసింది. ఆయా కేంద్రాల్లో పరిస్థితిని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): ఎడతెగని వానతో బుచ్చి పట్టణంలో జన జీవనం స్తంభించింది. మండలంలో పెన్నాపరీవాహక ప్రాంతాల్లోని మిన గల్లు, జొన్నవాడ, కాగులపాడు, శ్రీరంగరాజుపురం, దామరమడుగు పల్లిపాళెం, ఇస్కపాళెం తదితర ప్రాంతాల్లోని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆధికారి లీలారాణి, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఆర్ఐతో కలిసి ఆయా కేంద్రాలను సందర్శించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బుచ్చి మున్సిపాలిటీలో వర్షంలోనూ కార్మికులు పారిశుధ్య పనులు చేపట్టారు. చెల్లాయపాళెం పంచాయతీ పల్లిపాళెం గిరిజనకాలనీ, వడ్డిపాళెం గిరిజనకాలనీలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు డీ వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్ కోవూరు భరత్, చందు 80 కుటుంబాలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. పట్టణంలోని మంగలికట్ట ప్రభుత్వ గృహాలలో ఉన్న 100 కుటుంబాల పేదలకు మంగళవారం రాత్రి టీడీపీ అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, దొడ్ల కోదండరామిరెడ్డి అధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ యువత అధ్యక్షుడు కేఎస్, కిషోర్, సుమన్ పాల్గొన్నారు.



వెంకటాచలం : ఉధృతంగా పారుతున్న కనుపూరుచెరువు కలుజు

మగ్గం గుంటల్లోకి నీళ్లు

తుఫాన్ మండలంలోని పల్లాపల్లి వడ్డిపాళెం చేనేత కార్మికులను ముంచేసింది. మగ్గం గుంటల్లో నీళ్ళు చేరడంతో నూలు, పడుగు, జరి, పట్టు తడిసి ముద్దవడం, రంగులు ఊరడంతో పనికిరాకుండా పోయాయని నేత కార్మికుడు పప్పు నారాయణ వాపోయాడు. ఒక్కో మగ్గంగుంటలో సుమారు రూ.20వేలు మేర నష్టం వాటిల్లిందన్నారు.. మళ్ళీ మగ్గం గుంటలు వాడుకలోకి తీసుకోవాలంటే నెలరోజులు పడుతుందని ఆవేదన చెందారు. కాశీపాళెంలోనూ మగ్గం గుంటల్లో నీళ్ళు చేరడంతో చేనేత కార్మికులు నష్టపోయారని టీడీపీ చేనేత జిల్లా విభాగం జిల్లా కన్వీనర్ ఆశం సురేష్ తెలిపారు. చేనేత, జౌళి శాఖ డీవో రజని మగ్గం గుంటలను పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్మికులను పరామర్శించారు.

● **ఇందుకూరుపేట :** మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు లోతట్టు ప్రాంతాల్లో మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు పవన్‌కుమార్‌రెడ్డి పర్యటించారు. నీట మునిగిన ప్రాంతాల్లో కాలువలు పూడిక తీయించి నీరు నిలువకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో దాసరి విజయ్, లేబూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

కొడవలూరు (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు మండలంలోని నార్తురాజుపాలెంలో ఉన్న జడ్పీ పాఠశాల పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వినాయక నగర్ కాలనీకి చెందిన దాదాపు 90 మందికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భోజనం, దుప్పట్లు పంపిణీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, ఎంపీటీసీ కరకట్ట మల్లికార్జున్, తుప్ర ప్రవీణ్, బండి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో...

రాపూరు (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను మంగళవారం నాటికి రాపూరు పట్టణాన్ని చలి గాలులతో వణికించింది. మండలంలోని ఎం.వి.పురం, మద్దూరుపల్లి, కోటూరుపాడు, దాబలచెరువు, ఎర్ర చెరువు పూర్తి స్థాయిలో నిండాయి. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బంది అయినా తెలియచేయాలని తహసీల్దార్ ప్రజలను కోరారు. పట్టణంలోని సాయి బాబా ఆలయం వెనుక ఉన్న చల్లా యానాదులకు స్థానిక నార్త్ స్కూల్‌లో తాత్కాలిక పునరావాసం కల్పించారు. పెంచలకోన జలపాతంలో నీటి ఉధృతి అధికంగా ఉన్నందువల్ల పోలీస్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



బుచ్చిలో మగ్గం గుంటల వద్ద చేనేత కార్మికులను పరామర్శిస్తున్న హ్యాండ్‌లూం డీవో రజని



పొదలకూరు :రోడ్డుపై వాలిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది



పోతిరెడ్డిపాళెం సమీపంలో పొర్లుకట్ట వద్దకు చేరిన పెన్నానది ప్రవాహం

అతలాకుతలం

● విపత్తుల్ని ఎదుర్కొనే ధైర్యం చంద్రబాబు సొంతం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



పోతిరెడ్డిపాళెంలో నీట మునిగిన కాలనీ

కోవూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాను సృష్టించిన బీభత్సంతో మంగళవారం మండలంలోని గ్రామాలన్నీ అతలాకుతలమయ్యాయి. ఈదురు గాలులు, భారీ వర్షంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో మధ్యాహ్నానికి 51.4 మి.మీ వర్షం కురిసింది. వేగూరు గ్రామ లోతట్టుకాలనీల్లోని గిరిజనుల్ని సురక్షిత ప్రాంతాలకు సర్పంచు అమరావతి ఆధ్వర్యంలో తరలించారు. పేదలకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. టీడీపీ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ఇనమడుగు, పాటూరు గ్రామాల్లోని ముంపునకు గురయ్యే కాలనీవాసుల్ని జడ్పీ హైస్కూళ్లకు తరలించారు. కోవూరు పట్టణంలోని బజారు కూడలి వర్షపునీటితో నిండిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పర్యటించి సహాయక చర్యల్ని పరిశీలించారు. కాగా, రాష్ట్రానికి ఎలాంటి విపత్తులు వచ్చినప్పటికీ ఎదుర్కొనే ధైర్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ సొంతమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇనమడుగులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో మంగళవారం ఆమె మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు సమిష్టిగా పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్నానది పొర్లుకట్టల్ని పటిష్ఠపరచేందుకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారని చెప్పారు. పునరావాసకేంద్రంలో చేరిన 91మందికి ఆమె దుప్పట్లు, భోజనం, టూత్‌పేస్టులు, సబ్బులు పంపిణీ చేశారు. కార్య క్రమంలో పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి పాల్గొన్నారు.

విడవలూరులో...

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అధికారులు, నాయకులు అండగా నిలవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. పార్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. దుప్పట్లు, భోజన పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, గ్రామ సర్పంచు రామిశెట్టి స్వాతి, ఈస్ట్రన్ చానల్ డీసీ ఛైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఏటూరు హరిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. కాగా, పార్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పునరావస కేంగ్రానికి స్థానిక గిరిజన కాలనీకి చెందిన తిరంశెట్టి గోవిందు కుటుంబాన్ని తరలించారు. కాసేపటికే వారి ఇంటి పైకప్పు (శ్లాబు) కూలిపోయింది. అధికారులు, నాయకుల చొరవను ప్రజలు అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

స్తంభించిన జనజీవనం

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుపాన్ కారణంగా నగరంలోని జ నజీవనం స్తంభించింది. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంలో ఎక్కడికక్కడ ప్రజలు తీ వ్ర అసౌకర్యాలకు గురయ్యారు. దినసరి కూలీలకు పనులు లేక పస్తులున్నారు. చిరువ్యాపారులు వ్యాపారాలు లేక అవస్థలకు గురయ్యారు. సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. దీంతో పూరిగుడిసెలు, రేకుల ఇళ్లు ఉరుస్తున్నాయి. వృద్ధులు, చిన్నారులు చలికి వణికిపోతున్నారు. మరికొందరు జ్వరాలకు గురయ్యారు. రోడ్లపై ఆటోలు, బస్సులు రాకపోకలు లేకపోవడంతో జనం అవస్థలుపడ్డారు. నగరంలోని అన్నీ డివిజన్లలో చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.


నవాబుపేటలో శ్రీకృష్ణ ధర్మరాజస్వామి ఆలయం ముందు చేరిన నీరు

బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతం ముప్పు

- రాగానే వైద్యులను సంప్రదించాలి
- ప్రస్తుతం యువకులపై కూడా ప్రభావం
- జిల్లాలో 70 వేలమందికిపైగా బాధితులు
- నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్‌డే



నెల్లూరు (వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్‌స్ట్రోక్‌ను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా బాధితుడు పక్షవాతానికి గురయ్యే అవకాశం ఉంది. వ్యాధిపై ఆలస్యంగా వైద్య నిపుణులను కలసినా పెద్దగా ప్రయోజనం ఉండదు. ఒకప్పుడు వృద్ధాప్యంలో ఉన్నవారికి వచ్చే బ్రెయిన్‌స్ట్రోక్ (పక్షవాతం) ప్రస్తుతం 30 ఏళ్ల యువకులకు కూడా వస్తోంది. ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమలేకపోవటం వంటి కారణాల వల్ల కూడా పలువురు పక్షవాతానికి గురవుతున్నారు. ఈ వ్యాధి పట్ల తస్మాత్ జాగ్రత్త అంటూ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ అక్టోబరు 29న (నేడు) ప్రపంచ బ్రెయిన్‌స్ట్రోక్ నివారణ దినోత్సవం జరుపుకోవాలని తీర్మానించింది.

● జిల్లాపై ప్రభావం ఎక్కువే...

ప్రస్తుతం జిల్లాలో వ్యాధిగ్రస్థుల సంఖ్య నానాటికీ పెరుగుతుంది. బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన 4గంటల లోపు వైద్య నిపుణులను సంప్రదించి వెంటనే చికిత్స చేయించుకోవాలి. అవగాహన లోపంతో చేసే ఆలస్యం కారణంగా అనేకమంది కాళ్లు, చేతులతోపాటు ఇతర అవయవాలు చచ్చుబడి పక్షవాతానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ వ్యాధిగ్రస్థుల సంఖ్య 70వేలకు మందికిపైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం నెల్లూరులోని పలు కార్పొరేట్ ఆసుపత్రులకు పక్షవాత వ్యాధిగ్రస్థులు ఎక్కువగా వస్తున్నారు. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, జీవనశైలి మార్చుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు. కుటుంబంలో ఎవరికైనా పక్షవాతం ఉన్నట్లైతే తప్పనిసరిగా కుటుంబ సభ్యులు తరచూ వైద్య పరీక్షలు చేయించు కోవాలి.

● వ్యాధివచ్చే అవకాశం ఉన్న వారు

- రక్తపోటు(బీపీ) ఉన్నవారికి..
- గుండె జబ్బులు ఉన్నవారికి...
- రక్తంలో ఎక్కువశాతం కొవ్వు ఉన్నవారికి..
- స్థూలకాయం(ఒబెసిటి) ఉన్నవారికి..
- అధికంగా మద్యపానం, దూమపానం సేవించే వారికి..
- శారీరక శ్రమలేనివారికి..

వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు



వ్యాధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అది పక్షవాతానికి దారి తీస్తుంది. వ్యాధిగ్రస్థులకు వెంటనే చికిత్సలు అందించాల్సి ఉంటుంది. స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల లోపు ఆసుపత్రికి రావాలి. లేదంటే అవయవాలు చచ్చుబడి పక్షవాతానికి గురవుతారు. ఈ వ్యాధిపై అవగాహన అవసరం. ప్రస్తుతం వైద్య చికిత్సల్లో ఎంతో పురోగతి కనిపిస్తోంది.

- డాక్టర్ ధీరజ్, న్యూరో సర్జన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

ముంచేసిన 'మొంథా'

- తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షం ● తడిసి ముద్దయిన గ్రామాలు
- ఉధృతంగా కలుజుల ప్రవాహం ● మగ్గం గుంతల్లోకి వరద నీరు


ట్రంకురోడ్డుపై వర్షపునీరు


గాంధీ పార్కు రోడ్డులో...


పొగతోట వద్ద...

నెల్లూరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా ' తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావాన్నే చూపుతోంది. మంగళవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలువలు, వాగులు, గుంతలు నిండుకున్నాయి. నెల్లూరు చెరువుకు చేరిన వరదనీటితో పొట్టేపాళెం వద్ద కలుజు, కనుపూరు కాలువ నీటితో ములుముడి కలుజు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట గ్రామాల్లో మగ్గం గుంతల్లోకి నీళ్లు వచ్చాయి. నెల్లూరుకు పడమర గ్రామాల్లో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అక్కడక్కడా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. పొట్టేపాళెం, కోడూరుపాడు వద్ద బలహీనంగా ఉన్న పెన్నా పొర్లుకట్టలను ఇరిగేషన్ అధికారులు కట్టుదిట్టం చేశారు. పొట్టేపాళెం, కొండ్లపూడి గ్రామాల్లో పునరావాస కేంద్రాలను, వరద బాధిత కుటుంబాలకు ఆహారం, తాగునీటి అందిస్తున్నారు.

● అధికారులు, నేతల పర్యవేక్షణ

నీటి వనరులు దెబ్బతినడంపై అధికారులు, టీడీపీ నేతలు రంగంలోకి దిగారు. పొట్టేపాళెం, నెల్లూరు చెరువుల వద్ద నీటి ప్రవాహాన్ని రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీడీవో రమణమ్మ, సీఐ గుంజి వేణు, ఎస్సై సుధీర్ తమ సిబ్బందితో పర్యవేక్షించారు. లోతట్టు ప్రాంతాలు, పునరావాస కేంద్రాలు, కాలువలు, చెరువులు, ముంపునకు గురైయ్యే ప్రదేశాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. బుజబుజనెల్లూరు, పొదలకూరురోడ్డు, లేక్వ్యూకాలనీ, కల్లూరిపల్లి, రామలింగాపురం, మాగుంటలేఅవుట్ అండర్‌బ్రిడ్జిలు, 22,23,33 డివిజన్లను పరిశీలించి, కార్పొరేషన్ అధికారులతో కలిసి స్థానికులకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించారు. దెబ్బతిన్న చేనేత పరిశ్రమను ఆదుకోవాలని చేనేత ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు బాలాజీ, గోపాల్, రామసుబ్బయ్య డిమాండ్ చేశారు. మండలంలోని నారాయణరెడ్డిపేటలో దెబ్బతిన్న మగ్గాలను వారు పరిశీలించారు.

● ధర్మరాజులస్వామి ఆలయానికి వరద

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులస్వామి ఆలయాన్ని మంగళవారం వరద నీరు చుట్టుముట్టింది. ఆలయానికి రెండువైపులా ఎత్తుగా రోడ్డు ఉండడంతో ఆలయంలోకి ఆ పరిసరప్రాంతాల నీరు చేరింది. మట్టి తోలించి లెవల్ చేయించమని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు, నారాయణ విద్యా సంస్థల జీఎంలకు వినతిపత్రాలు ఇచ్చినా, ఇంతవరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదనలు వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలన్నారు.


ఆత్మకూరు బస్టాండు అండర్‌బ్రిడ్జి వద్ద..


చంద్రబాబు నగర్ చప్టాలో పారుతున్న నీరు

ఆహార పొట్లాల పంపిణీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుపాను బాధితులకు మంగళవారం ఆహార పొట్లాలను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్ బృందం పంపిణీ చేశారు. 47, 48వ డివిజన్లలోని లోతట్టు ప్రాంతాల బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.కాగా గిడ్డంగివీధి బావిసందులో గోడ కూలగా, వెంటనే మున్సిపల్ సిబ్బంది వచ్చి గోడను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాబాషా, సురేంద్రసింగ్, చిట్టాటూరి విజయలక్ష్మి, రత్నమ్మ, షేక్ రబియా, కంచికృష్ణ, సునీల్‌సింగ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ధైర్యం చెప్పిన నుడా ఛైర్మన్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి బాధితులకు ధైర్యం చెప్పి ఆహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సూచనల మేరకు మంత్రి నారాయణ ఆదేశాలతో నెల్లూరు సిటీలోని నేతలు, కార్యకర్తలు తుఫాను బాధితులను ఆదుకునేందుకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. సిటీ నియోజకవర్గంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా టీడీపీ నేతలు, కార్యకర్తలు అందుబాటులో ఉంటారని, ఆందోళన చెందవద్దని బాధితులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుధాకర్‌రెడ్డి, కత్తి చంద్ర, దాసరి అశోక్, శీనయ్య, కామాక్షయ్య, యేసు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీకి నాగేశ్వరమ్మ

నెల్లూరు(విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని వినాయక మిషన్ రీసెర్చ్ ఫౌండేషన్ విశ్వవిద్యాలయంలో బుధవారం నుంచి నవంబరు 2 వరకు జరిగే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు నెల్లూరు ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థిని కే. నాగేశ్వరమ్మ వీఎస్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.లక్ష్మీప్రసన్న తెలిపారు. మంగళవారం జరిగిన అభినందనలో ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత క్రీడా కిట్‌ను తమ విద్యార్థినికి అందించి అభినందించారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఎం.రవీంద్రబాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ నుంచి క్రీడా కిట్‌ను అందుకుంటున్న నాగేశ్వరమ్మ

ఆలయ పునర్నిర్మాణ పూజల ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పూజలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విష్వసేనారాధన, పుణ్యాహవచనం, వాస్తు హోమం, ప్రవేశ బలి, మంగళహారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వంశపారంపర్య ధర్మకర్తలతోపాటు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ బుధవారం ఉదయం 11.18 గంటలకు జరిగే శంకుస్థాపనకు త్రిదండి చిన్నరామానుజ జీయర్ స్వామి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ మజ్జిగ చంద్రమౌళీరెడ్డి, సహాయ కమిషనర్ జే. శ్రీనివాసరావు, సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మంగళవారం కాత్యాయనీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘురామమూర్తి ఆధ్వర్యంలో ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చండీహోమం, సుందరేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. జోరువానలోనూ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఏసీ కోవూరు జనార్దన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.


కాత్యాయినీ అలంకారంలో రాజరాజేశ్వరి

పొట్టేపాళెం వద్ద రోడ్డుకు మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు - జొన్నవాడ మార్గంలోని పొట్టేపాళెం కలుజు వద్ద ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన రోడ్డుకు అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేయించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ప్రత్యామ్నాయం ప్రమాదకరం' అన్న కథనానికి స్పందించిన వేదగిరి క్షేత్రం ఛైర్మన్ ఈ. అచ్యుత్ శంకర్‌రెడ్డి, రూరల్ డీఎస్పీ జీ. శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు మంగళవారం పాడైన రోడ్డుకు మట్టితోలించి బాగు చేయించారు.

4న సంస్మరణ సభ

నెల్లూరు (సాంస్కృతికం) అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌన్‌హాలు ప్రాంగణంలోని నెల్లూరు వర్ధమాన సమాజ భవనంలో నవంబరు 4న కవికోకిల దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి, పొణకా కనకమ్మ ఆశయ సాధన సమితిల ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు కన్వీనర్ బీ.సురేంద్రనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ, వేమూరి శివప్రసాద్‌రావు, మెట్టు రామచంద్ర ప్రసాద్, బత్తిన సాయికుమార్‌రెడ్డిలను స్మరించుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 9 మంది మహనీయుల ఫొటోలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

భోజనం, దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన డాడీ యూత్ ఫౌండేషన్ మంగళవారం మొంథా తుఫాన్ వర్షంలో చిక్కుకున్న యాచకులు, అనాథలు, వృద్ధులకు భోజనం, దుప్పట్లు పంపిణీ చేసింది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాడీ యూత్ ఫౌండేషన్ ఛైర్మన్ ఆనందరావు దంపతులు పాల్గొన్నారు.

నగరంలో రోజంతా వాన

- కూడళ్ల వద్ద వర్షపునీరు
- వాహనదారులకు తప్పని తిప్పలు ● రంగంలోకి దిగిన కలెక్టర్, ఎస్పీ, తదితరులు

నెల్లూరు(సిటీ),అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నగరాన్ని తడిపి ముద్దచేసింది. మంగళవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు, రోడ్లు, కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చిన ప్రజలకు, వాహనదారులకు తిప్పలు తప్పలేదు. గాంధీ బొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జి, సండే మార్కెట్, రంగనాయకులపేట, బర్వాడీపాళెం, కేవీఆర్ జంక్షన్, అయ్యప్పగుడి, మినీబైపాస్‌రోడ్డు కేఎన్ఆర్, వనంతోపు జంక్షన్, మిలీనియం సబ్ స్టేషన్ ప్రదేశం, తల్పగిరికాలనీ, కల్లూరుపల్లి ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలతో కూడిన పూడిక తీస్తున్న అధికారులు వచ్చిన నీళ్లు, వచ్చినట్లు బయటకు పంపేస్తున్నారు. విలీన, శివారు ప్రాంతాలలో మాత్రం నీళ్లు బయటకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. నగరంలో పరిస్థితిని కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వెజెండ్ల, కమిషనర్ నందన్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. అయ్యప్పగుడి వద్ద భారీగా నీటి ప్రవాహం నెలకొనడంతో ఎక్స్‌కవవేటర్ల సహాయంతో కాలువలు తీసి బయటకు పంపేశారు. నగరంలోని 14 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, వరద బాధితులకు అక్కడకు తరలిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు.

సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి : టీడీపీ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పురపాలకశాఖమంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలతో మంగళవారం టీడీపీ నేతలు లోతట్టు ప్రాంతాలవారు జాగ్రత్తగా ఉండాలని తెలియచేశారు. ఈ సందర్భంగా మంత్రి ఓ ప్రకటన విడుదల చేస్తూ లోతట్టు ప్రాంతాల వారు సురక్షితంగా ఉండాలని, అత్యవసర స్థితిలో పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. ఇందుకు అనుగుణంగా మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు నెల్లూరులోని లోతట్టు ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి తుఫాన్‌లో జాగ్రత్త గా ఉండాలని కోరారు. అలాగే పునరావాస కేంద్రాల్లో బాధితులందరికీ అన్నీ వసతులు కల్పించాలని అధికారులకు తెలియచేశారు.

లారీ ఇరుక్కుని ట్రాఫిక్‌కు అంతరాయం

నెల్లూరు(క్రైం) : ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల వద్ద లారీ ఇరుక్కుపోవడతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. బుజబుజనెల్లూరు హైవేపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. మంగళవారం వర్షాల కారణంతో అక్కడ అంతా బురదమయంగా మారడంతో గూడూరు నుంచి కావలి వైపు వెళ్లే పదహారు టైర్ల భారీ వాహనం ఇరుక్కుపోయింది. దీంతో వాహనదారులు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. సౌత్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరానికి చిన్నజీయర్ స్వామి రాక

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళవారం రాత్రి నెల్లూరు అల్లీపురంలోని విడిది గృహానికి చేరుకున్నారు. ఆయనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారు బుధవారం మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణ శంకుస్థాపనకు హాజరవుతారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు.


చినజీయర్ స్వామితో మంత్రి ఆనం

● నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం రాత్రి శివపార్వతులకు ప్రాకారోత్సవం జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. సాయంత్రం భారీ సంఖ్యలో భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు.

మాతృసంస్థకు ఏపీఐఐసీ డీజెడ్‌ఎం..



నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) ఏపీఐఐసీ(ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) డీజెడ్‌ఎంగా ఉన్న వెంకట సురేష్‌ను మాతృ సంస్థ అయిన పరిశ్రమల శాఖకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పరిశ్రమలశాఖ డీడీ(డిప్యూటీ డైరక్టర్)గా విజయవాడకు ప్రధాన కార్యాలయానికి అయన్ను బదిలీ చేశారు.ఇక్కడ ఏపీఐఐసీలో ఐదేళ్లపాటు ఉత్తమసేవలు అందించిన ఆయన్ను ఏపీఐఐసీ అధికారులు,సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తాను మాతృ సంస్థకు వెళ్లడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్‌ఎం శివకుమార్,శేఖర్‌రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం...

● పొంగిన వాగులు, చెరువులు


పేదలకు దుప్పట్లు అందజేస్తున్న పోలీసులు, దాతలు

మనుబోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం రోజంతా వాన కురిసింది. దీంతో జనం బయటకు వచ్చేందు కు నానా అవస్థలు పడ్డారు. మరోపక్క వాగులు పొంగి పొర్లాయి, చెరువులు నిండాయి. మండలంలో లక్ష్మీనరసింహపురం, మనుబోలు, బద్దెవోలు, పిడూరు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 106 మందికి వసతులు కల్పించినట్లు డీటీ ప్రదీప్ తెలిపారు. పునరావాస కేంద్రాలను డీఎల్‌డీవో వసుమతి ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్న గిరిజనులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణ య్య, ఎంపీడీవో జలజాక్షి, ఎస్.ఐ. శివరాకేష్ పాల్గొన్నారు. కల్లేరు, పిల్లేరు వాగులు పొంగడంతో కామాక్షితాయి సంగమేశ్వరాలయంలో నీరు చేరింది. కాగా, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సూచనలతో పేదలకు దుప్పట్లు, దివ్యాంగులకు గొడుగులు పంపిణీ చేసినట్లు టీడీపీ నాయకుడు, దుప్పట్ల దాత చేరెడ్డి పద్మనాభరెడ్డి తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 500మంది పేదలకు దుప్పట్లను సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్.ఐ. శివరాకేష్, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య చేతులమీదుగా అందజేశారు. అనంతరం పేదలకు భోజనం ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ సాని వెంకట రమణయ్య, టీడీపీ నాయకులు దండు చంద్రశేఖర్‌రెడ్డి, మోపూరు ధనుంజయరెడ్డి, శివుడు రాజాగౌడ్, పాడి వినోద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో సహాయక చర్యలు

పొదలకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నీ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండటంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. పొదలకూరు మెయిన్ రోడ్డులోని రైస్ మిల్ సెంటర్‌లో ఓ భారీ వృక్షం రోడ్డుపై కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అధికార యంత్రాంగం స్పందించి చెట్టును తొలగించారు. డేగపూడి ఎస్టీ కాలనీ సమీపంలో రాపూరు - పొదలకూరు ప్రధాన రహదారిపై బ్రిడ్జి కుంగడంతో అప్రమత్తమైన మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులు జోరు వానలో ఆ ప్రదేశానికి వెళ్లి వంతెనకు సిమెంటు పైపులను ఏర్పాటు చేశారు. మరుపూరు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిని కూడా పరిశీలించి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శివకృష్ణయ్య, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్ఐ మహమ్మద్ హనీఫ్, ఆర్‌అండ్‌బీ అధికారి సురేఖ, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, దేవినేని శరత్, తదితరులు పాల్గొన్నారు. కాగా, పొదలకూరు పట్టణంలోని శ్రామికనగర్‌లోని గిరిజనులు, పాములవీధిలోని ఎస్సీలు, సచివాలయం సమీపంలోని కొంతమందికి, అంకుపల్లి ఎస్టీ కాలనీలోని గిరిజనులకు టీడీపీ యువ నాయకులు 500 ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. డేగా యశ్వంత్‌రెడ్డి, ఆదాల మురళి, అట్లూరి అనిల్‌కుమార్‌రెడ్డి, కే విజయ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి వద్ద అధికారులు, నాయకులు

పునరావాస కేంద్రాలకు తరలింపు..

ముత్తుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీవ్రత పెరగడంతో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు రావడంతో ఆ ప్రాంతవాసులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు అధికారులు తరలించారు. మండలాధికారుల బృందం తీర గ్రామాలలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తోంది. పైనంపురం గిరిజన సంఘం నేలటూరు దళితవాడలో పరిస్థితులు గమనించి వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. పొట్టెంపాడులో నక్కల కాలువ నీటి ప్రవాహానికి ఏర్పడ్డ అడ్డంకులు తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ రవినాయక్, అదానీ కృష్ణపట్నం పోర్టులో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. తహసీల్దారు స్వప్న, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రెడ్డి పరిస్థితులను సమీక్షిస్తున్నారు. కృష్ణపట్నం ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకుడు రాగల శివకృష్ణ, దువ్వూరువారిపాలెం ఎస్టీ కాలనీలో వేల్పుల నాగార్జున గిరిజనులకు భోజన వసతి కల్పించారు.


ముత్తుకూరులో ఇళ్లలోకి చేరిన నీరు

నిండిన చెరువులు

● సర్వేపల్లి రిజర్వాయర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో అన్నీ చెరువులు నిండాయి. సర్వేపల్లి రిజర్వాయర్ కూడా పూర్తిగా నిండిపోయింది. దీంతో వరద నీటిని విడుదల చేయడానికి కలుజు గేట్లు ఎత్తారు. కనుపూరు, ఇడిమేపల్లి చెరువులు కూడా పూర్తిస్థాయిలో నిండిపోవడంతో అధికారులు కలుజు గేట్లు మొత్తం ఎత్తివేశారు. మిగిలిన చెరు వుల నుంచి కూడా నీటిని కిందికి వదులుతు న్నారు. కసుమూరు, కందలపాడు, ఇడిమేపల్లి చెరువుల కట్టలు తెగిపోయే ప్రమాదముందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. కసుమూరు, మల్లుగుంట సంఘం, నిడిగుంటపాలెం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే విద్యుత్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై సరఫరాను పునరుద్ధరించారు. కాగా, జోరువానలో సైతం సర్వేపల్లి రిజర్వాయర్‌ను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం రిజర్వాయర్ ప్రమాదకర పరిస్థితిలో ఉందన్నారు. ఆధునీకీకరణ పనులు అత్యవసరంగా చేపట్టాలని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, చవటపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, నిడిగుంటపాలెం సాగునీటి సంఘం అధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.


సర్వేపల్లి రిజర్వాయర్ కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

కనుపూరు చెరువును పరిశీలించిన కాకాణి

వెంకటాచలంలోని కనుపూరు చెరువును మంగళవారం సాయంత్రం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, కనుపూరు సర్పంచ్ నాటకం శీనయ్య పాల్గొన్నారు.

మండలం	వర్షపాతం
కందుకూరు	145.8
కావలి	130.4
దగదర్తి	117.0
జలదంకి	113.2
అల్లూరు	110.8
విడవలూరు	109.6
కొడవలూరు	109.4
వులవపాడు	106.4
గుడ్లూరు	104.8
బోగోలు	97.8
వలేటివారి పాళెం	90.0
కలిగిరి	89.8
కోవూరు	88.2
లింగసముద్రం	83.4
టీపీ గూడూరు	83.0
నెల్లూరు అర్బన్	80.6
వింజమూరు	78.8
కొండాపురం	78.6
సంగం	76.6
ఉదయగిరి	75.4
ఇందుకూరుపేట	74.4
ఏఎస్‌పేట	72.8
నెల్లూరు రూరల్	72.4
పొదలకూరు	71.6
బుచ్చిరెడ్డి పాళెం	71.0
చేజర్ల	69.2
వరికుంటపాడు	67.8
వెంకటాచలం	63.6
ఆత్మకూరు	59.2
ముత్తుకూరు	57.4
సైదాపురం	55.2
మర్రిపాడు	54.4
దుత్తలూరు	52.8
మనుబోలు	52.8
కలువాయి	51.0
అనంతసాగరం	47.4
సీతారాంపురం	40.4
రాపూరు	25.2

నెల్లూరు శివార్లలోని తల్పగిరి కాలనీని చుట్టుముట్టిన వర్షపు నీరు



మరో 36 గంటలు

భారీ వర్షం

- జిల్లాపై మొంథా ఎఫెక్ట్
- రోజంతా ఎడతెరిపి లేని వాన
- పరిస్థితిని పర్యవేక్షిస్తున్న కలెక్టర్, అధికారుల బృందం

నెల్లూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని గడగడలాడిస్తున్న మొంథా తుఫాను జిల్లాను మాత్రం కాస్త కరుణించింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం రాత్రి వరకు 24 గంటలపాటు ఎడతెరపి లేకుండా ఓ మోస్తారు వర్షం కురవడం మినహా జిల్లాలో మరెలాంటి నష్టం సంభవించలేదు. ఎడతెరపి లేని వర్షం కారణంగా మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. భారీ వర్ష సూచనలతో దాదాపు ప్రజలంతా ఇళ్లకే పరిమితం అయ్యారు. జిల్లా సగటు వర్షపాతం 79.7 మి.మీ నమోదైంది. వాతావరణ శాఖ ప్రకటనల ప్రకారం మొంథా తుఫాను ప్రభావం నెల్లూరు జిల్లాపై ఎక్కువగా ఉంటుందని భావించారు. సోమవారం సాయంత్రం నుంచే జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భావించారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంది. అయితే అదృష్టవ శాత్తు సోమ, మంగళవారం రాత్రి 8 గంటల వరకు జిల్లాలో మోస్తారు వర్షాలు తప్ప ఎక్కడా భారీ వర్షాలు నమోదు కాలేదు. ఈదురుగాలుల ప్రభావం కూడా చాలా తక్కువగా కనిపించింది. అయితే తీర ప్రాంతాల్లో మాత్రం సముద్రం అల్లకల్లోలంగా కనిపించడంతో సరిసర ప్రాంత ప్రజలు హడలిపోయారు. కృష్ణపట్నం ఓడరేవులో 8వ నంబరు ప్రమాద సూచికను ఎగురవేశారు. బిట్రగుంట ఫిషింగ్ హార్బర్ సముద్ర అలల తాకిడికి అల్లాడిపోయింది.

● ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా నెల్లూరు నగరంలో రోడ్లు జలమయం అయ్యాయి. మురుగు, వర్షపు నీళ్లతో ట్రంక్ రోడ్డు, గాంధీనగర్ వేదాయపాళెం సెంటర్లు మడుగులుగా కనిపించాయి. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు అయిన తల్పగిరి, సప్తగిరి నగర్ కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు ప్రవేశించాయి. కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు-తెట్టు రహదారిలో పొట్లూరు వద్ద రాళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో కావలి-గుడ్లూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. జలదంకి పంచాయతీ గమల్లపాలెం గ్రామంలో ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరద నీటిలో జిల్లా పరిధిలోని ప్రాజెక్టులు, చెరువులు నిండుకుండల్లా మారాయి. మంగళవారం ఉదయం నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రత్యేక అధికారి యువరాజులు జిల్లాలో తుఫాను పరిస్థితిని సమీక్షించారు. ట్రాన్స్‌కో సీఎండీ శివశంకర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లో తిష్ఠ వేసి ఎక్కడా విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించారు. వాతావరణం శాఖ అంచనా ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 11 గంటలకు తుఫాను తీరం తాకుతుంది. అప్పటి నుంచి మరో 36 గంటల వ్యవధిలో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సంకేతాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం అయ్యింది.



నెల్లూరు : తెలుగుగంగ కాలనీలో ఇళ్ల వద్ద నీరు



కావలి : తహసీల్దారు కార్యాలయం ఎదురుగా ట్రంకురోడ్డుపై పడిపోయిన చెట్టు



జలదంకి : గమల్ల పాలెంలో ఇళ్లలోకి నీరు



ఉదయగిరిలో నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు



నెల్లూరు : సండేమార్కెట్ దుస్థితి



జలదంకి : ఊళ్లవాగు వద్ద రాకపోకలు నిలిపివేస్తూ రోడ్డుకు అడ్డంగా వేస్తున్న కంప



ముత్తుకూరు : పొంగిపొర్లుతున్న బకింగ్‌హాం కాలువ



నెల్లూరు : వరద పరిస్థితిపై ఆరా తీస్తున్న కలెక్టర్ శుక్లా, కమిషనర్ నందన్, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



: నెల్లూరు : ములుముడిలో మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని ఎత్తిపోస్తున్న కార్మికుడు

తుఫాన్ బాధితులకు అండగా..



కోవూరు : బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



ఉదయగిరి : ఉజ్జంపల్లిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్



కావలి: పెంకులఫ్యాక్టరీ గిరిజన కాలనీలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి



నెల్లూరులో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



కొండాపురం : కొమ్ముపాలెంలో ఆహార పొట్లాలు అందచేస్తున్న తానికొండ అనూష



ఆత్మకూరు : నెల్లూరుపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆహారం పంపిణీ



పొదలకూరులో ఆహారం పంపిణీ చేస్తున్న స్థానికులు

వీఎస్‌యూలో నిర్లక్ష్య వైఖరి

- తుఫాన్ అయినా పరీక్షలు, తరగతుల నిర్వహణ
- విమర్శలతో అప్పటికప్పుడు వాయిదా ప్రకటన

వెంకటాచలం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా వ్యాప్తంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అన్ని శాఖల అధికారులను గత రెండు రోజులుగా అలర్ట్ చేస్తున్నారు. ఈక్రమంలో రెండు రోజులుగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సెలవులు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. కానీ విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అధికారలుఉ మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు చేసిన ఈనెల 27న జిల్లా వ్యాప్తంగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించి వర్సిటీ విమర్శల పాలైంది. అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలకు ఈనెల 27వ తేదీ సెలవు ప్రకటించకపోవడంతో పలు కళాశాలలు తరగతులు నిర్వహించాయి. దీంతో వర్సిటీ అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. కొందరు వర్సిటీ అధికారులు నియంతల్లా వ్యవహరిస్తుండడంతోనే తరచుగా యూనివర్సిటీ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

● సెలవు ప్రకటించడంలో నిర్లక్ష్యం

తుఫాన్ ఉగ్రరూపం దాల్చడంతో మంగళవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అయినా కళాశాలలకు ముందుగానే సెలవు ప్రకటించడంలో వర్సిటీ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించారు. మంగళవారం జరగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను సైతం వాయిదా వేయకపోవడం గమనార్హం. దీనిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు రావడంతో అప్పటికప్పుడే వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత స్పందించి మంగళవారం ఉదయం 7.40 గంటల ప్రాంతంలో వర్సిటీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌లలో మంగళవారం జరగాల్సిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. అలాగే యూనివర్సిటీతోపాటు అనుబంధ కళాశాలలకు సెలవు ప్రకటిం చారు. ఈ క్రమంలో అధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.



విద్యుత్ అంతరాయం ఏర్పడిన స్వర్ణముఖి మహిళా వసతి గృహం

● చీకట్లో విద్యార్థినులు

వర్సిటీ వసతి గృహంలో మంగళవారం అంధకారం అలముకుంది. యూనివర్సిటీ ప్రాంగణంలోని స్వర్ణముఖి మహిళా వసతి గృహనికి వచ్చే విద్యుత్ లైన్‌లో సమస్య ఏర్పడింది. దీంతో విద్యుత్ అంతరాయం నెలకొని విద్యార్థినులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ ఉందని తెలిసి కూడా హాస్టల్ మెయిన్ ఎలక్ట్రీషియన్‌కు సెలవు ఇవ్వడం, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవ డంపై విద్యార్థులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమస్య ఈనెల 21వ తేదీ కూడా ఏర్పడింది. దీనిపై రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా ప్రత్యామ్నాయ ఎలక్ట్రీషియన్లతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనారిటీ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ షేక్ హైపా ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు నెల్లూరులోని మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయంలో కానీ, 89785 21854 నంబరులోకానీ సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఐఈఆర్పీల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి

నెల్లూరు(విద్య), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల భవిత కేంద్రాల్లోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 88 మంది ఐఈఆర్పీల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం పూర్తయింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీ రావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో త్రిసభ్య కమిటీ రెండురోజులపాటు సర్టిఫికెట్లను పరిశీలించి నిర్ధారణ చేశారు. పూర్తయిన వారి వివరాలను డీఈవో లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో వెరిఫికేషన్ చేసి, అందులో తప్పులుంటే తిరిగి ఐఈఆర్పీల లాగిన్‌కు పంపిస్తామని డీఈవో తెలిపారు. వీటిని సరిదిద్ది తిరిగి సబ్‌మిట్ చేసిన తరువాత, ఎంఈవోల లాగిన్ ద్వారా వాటిని వెరిఫై చేసిన అనంతరం అప్రూవల్ చేసి డీవోఈ లాగిన్‌కు పంపాలన్నారు. ఈ పరిశీలనలో డిప్యూటీ ఈవో వెంకటేశ్వరనాయక్, టీపీగూడూరు ఎంఈవో జయరామ్‌నాయుడు, టీపీగూడూరు జడ్పీ హెచ్‌ఎం రియాజ్ అహ్మద్, ఎస్ఎస్ఏ సహిత విద్యా కోఆర్డినేటర్ పీ.ప్రసాద్‌రావు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో ఎస్పీ పరిశీలన

ఇందుకూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలోని ముంపు ప్రాంతాలను ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మంగళవారం సందర్శించారు. పునరావాసం, సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఇందుకూరుపేట మండల పరిధిలోని ముదివర్తిపాలెంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ఆహారం, వైద్యసేవలు, నీరు ఇతర వసతులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ జిల్లా వ్యాప్తంగా ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. 24గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర పరిస్థితి వచ్చినా, సమస్యలకు గురైనా ప్రజలు వెంటనే డయల్ 112కుగానీ పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్లు 93929 03413చ 94407 96383, 94407 96370లకు గానీ సమాచారం తెలపాలని కోరారు.

పోర్టులో 8వ నెంబరు ప్రమాద హెచ్చరిక

● గాలులతో వణుకుతున్న తీరం



కృష్ణపట్నం తీరంలో ఎగిసిపడుతున్న అలలు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీరానికి చేరువవుతున్న కొద్దీ కడలి కల్లోలంగా మారింది. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు, వేగంగా వీచే ఈదురుగాలులు తీరప్రాంతాన్ని వణికిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో తీర గ్రామాల ప్రజలు ఇళ్లలోనే ఉండిపోయారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా అదానీ కృష్ణపట్నం పోర్టు అధికారులు 8వ నెంబరు ప్రమాద హెచ్చరిక జెండా ఎగురవేశారు. సముద్రం ఉధృతంగా ఎగిసిపడుతుండడంతో అలలు తీరం కట్టలు తాకుతూ ముందుకు వస్తున్నాయి. తీర ప్రాంత గ్రామాలైన నేలటూరు, పైనాపురం, దళితవాడ, గిరిజకాలనీల్లో వర్షపు నీరు రోడ్లను ముంచేసి ఇళ్లలోకి చేరింది. సరైన డ్రైనేజీ వ్యవస్థలేక రహదారులు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కూడా అంతరాయం కలిగింది. నక్కల కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. పొట్టెంపాడు బ్రిడ్జి వద్ద తూటాకుతో నీటి ప్రవాహానికి అడ్డంకి ఏర్పడింది. విషయం తెలుసుకున్న తహసీల్దారు స్వప్న అక్కడికి చేరుకుని యంత్రాల సాయంతో అడ్డంకులను తొలగించారు. 50 - 70 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. కృష్ణపట్నం పోర్టు, ఇతర పరిశ్రమలు, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, వైద్య శాఖలు కలిసి సహాయక చర్యలకు సిద్ధమయ్యాయి.

అలుగు పారుతున్న ఆనకట్ట : స్తంభించిన రాకపోకలు

ఉదయగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆనకట్ట ఉధృతంగా అలుగు పారడంతో మంగళవారం రాత్రి రాకపోకలు స్తంభించాయి. ఎగువ ప్రాంతాల నుంచి ఆనకట్టకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అలుగు పారుతోంది. దీంతో పట్టణంలో నుంచి బీసీ, ఎస్టీ కాలనీ, స్టేట్‌పేటకు రాకపోకలు స్తంభించాయి. మరోవైపు ఇతర ప్రాంతాల నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలు మరో మార్గం నుంచి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయగిరి సీఐ వెంకటరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీను, డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా అలుగుకు రెండువైపులా తాళ్లు కట్టి ప్రజలు, వాహనాలు రాకుండా పర్యవేక్షిస్తున్నారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11266
వెండి కిలో ధర	రూ. 145300
వెండి ఒక గ్రాము	రూ. 151.30



ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీని పరిశీలిస్తున్న ఆర్డీవో పావని, అధికారులు, ప్రజా ప్రతినిధులు



సంగం : కలిగిరి రహదారిలో రాత్రి పూట చెట్టు నేలకూలడంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా తొలగిస్తున్న పోలీసులు



గాంధీజన సంఘంలో వర్షపు నీరు వెళ్లేందుకు పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

వణికిస్తున్న మొంథా!

- జనజీవనం అస్తవ్యస్తం
- అధికార యంత్రాంగం అప్రమత్తం
- లోతట్టు నుంచి సురక్షిత ప్రాంతాలకు ప్రజల తరలింపు

ఆత్మకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలను వణికించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి ఆగకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో, పలు గ్రామాల్లో కాలనీలు జలమయం కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించి వసతులు ఏర్పాటు చేశారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో పావని సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టేలా పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను ఆమె పరిశీలిం చారు. మోడల్ ఎస్టీ కాలనీ, సెయింట్ మేరీస్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎస్టీ కాలనీ, నెల్లూరుపాళెం ఎస్టీ కాలనీ, ముస్లిం కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఆమె వెంట మున్సిపల్ ఛైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐ జీ గంగాధర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రా రెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు. బుధవారం కూడా వర్షం కొనసాగుతుందన్న హెచ్చరికలతో లోతట్టు ప్రాంతాలు, పెన్నానది పరీవాహ క ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలకు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు అర్బన్ వైద్య శాల వైద్యాధికారి షేక్ అస్మా సూచించారు. మంగళవారం ఆమె పట్టణం లోని గురుకుల పాఠశాలలను సందర్శించారు. వర్షాలు నీరు కలుషితమ య్యే అవకాశం ఉందని, అలాంటి నీటిని తాగడంతో వ్యాధుల బారినపడతా రని తెలిపారు. వర్షంలో తడవొద్దని చెబుతూ పలు జాగ్రత్తలు సూచించా రు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీ రమ్య, వైద్య సిబ్బంది సిద్దం సుధాకర్, జీ రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలుజు పారుతున్నా చెరువులు

సంగం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు కలుజు పారుతున్నాయి. మేజర్ చెరువైన దువ్వూరు చెరువు నిండి కలుజు పారుతోంది. దీంతో వంగల్లు - సంగం మధ్య రాకపోకలు స్తంభించాయి. ప్రమాదకరంగా ఉన్న కలుజుపై గ్రామస్థులు రాకపోకలు సాగించకుండా పోలీసులు వంగల్లు రహదారికి ముళ్ల కంపను అడ్డంగా ఏర్పాటు చేశారు. మర్రిపాడు, తలుపూరుపాడు, కొరిమెర్ల, చెన్నవరప్పాడు, జంగాలకండ్రిక తదితర చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. బీరాపేరు పొంగి ప్రవహిస్తుండడంతో పెరమన - సంగం మధ్య మంగళవారం సాయంత్రం నుంచి రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా బొగ్గేరు కలుజు పారుతుండడంతో వీర్లగుడిపాడుకు, చవిటి వాగు ప్రవహిస్తుండడంతో చెన్నవరప్పాడుకు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. కొరిమెర్ల, సంగం మధ్య రహదారిపై ఓ భారీ వృక్షం నేలకూలింది. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజేష్ ఘటన స్థలానికి వెళ్ళి వాహన రాకపోకలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. గాంధీజనసంఘంలో భారీగా వర్షపు నీళ్లు నిలబడటంతో ఇళ్లు నీట మునిగాయి. దీంతో అధికారులు కాలువలో పూడిక తీయించారు.



శ్రీకొలను ఎస్టీ కాలనీలో యంత్రం సాయంతో వర్షపు నీటి తరలింపు

ఇళ్లలోకి వర్షపు నీరు

ఏఎస్‌పేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. గుడిపాడు సమీపంలోని బీరాపేరు వాగు, ఏఎస్ పేట సమీపంలోని నక్కల వాగు రోడ్లపైకి పొంగాయి. ప్రజలు ఇళ్లకే పరిమితం అయ్యారు. ఏఎస్ పేటలోని ఎస్టీ కాలనీ, షపా బావి సెంటర్‌లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. శ్రీకొలను ఎస్టి కాలనీలో వర్షపునీరు చేరడంతో తహసీల్దారు అనిల్‌కుమార్, సంగం సీఐ వేమారెడ్డి, ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు ఆ నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఏఎస్‌పేటలో రెండు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. నిత్యం యాత్రికులతో సందడిగా ఉండే ఏఎస్‌పేట దర్గా సెంటర్ వర్షాలతో నిర్మానుషంగా మారింది. వర్షం మరో రోజు కురిస్తే నక్కల వాగు, తెల్లపాడు చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించి ఏఎస్‌పేటను నీరు చుట్టుముట్టే అవకాశం ఉంది.

పొంగి పొర్లుతున్న నల్లవాగు

- గోపవరాల మధ్య నిలిచిన రాకపోకలు

కలువాయి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. నల్లవాగు పొంగి పోర్లుతుండంతో చిన్నగోపరవం, కేసీ గోపవరం గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. మంగళవారం తహసీల్దారు డీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామి రెడ్డి, నాయకుడు తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి వాగును పరిశీలించారు. సమీపంలోని ఎస్టీ కాలనీ వాసులను సచివాలయ భవనంలోనికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతీయ రహదారి 565 కోసం పెన్నానదిపై నిర్మించిన వంతెన కింద నివా సం ఉంటున్న కుటుంబాల వారిని పెన్నబద్వేలిలో ఏర్పాటు చేసిన పున రావాసకేంద్రానికి తరలించినట్లు తహసీల్దారు తెలిపారు. కలువాయిలో వర్షపు నీరు నిలబడకుండా డ్రైన్లను యంత్రాలతో శుభ్రం చేయించారు. గ్రామంలోని పలు కూడళ్లలో ఉన్న చెత్తను తొలగించే కార్యక్రమాన్ని ఎంపీ డీవో శైలజ పర్యవేక్షించారు.



కలువాయి మండలంలో పొంగిన నల్లవాగు

మర్రిపాడులో 54.5 మి.మీ. వర్షం

మర్రిపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మర్రిపాడు మండలంలో ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇళ్లకే పరిమిత మయ్యారు. కేతమన్నేరు వాగు, సన్నవారి బొగ్గేరుతోపాటు గ్రామాల్లో వంకలు పొంగి పొర్లుతున్నాయి. మంగళవారం మండలంలో 54.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్, ఎస్ఐ శ్రీనివాస్‌రావు గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించారు.

ఈదురుగాలి.... ఆగని వాన

- అలుగులు పారుతున్న చెరువులు
- నీటమునిగిన పంటలు

ఉదయగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఉదయగిరిలో సోమవారం రాత్రి నుంచి ఈదురుగాలులతో కూడిన ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో మంగళవారం జనజీవనం స్తంభించింది. ఉదయగిరి మండలంలోని దున్నపోతుల, పిల్లాపేరు వాగులతోపాటు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లి ఎస్టీ కాలనీకి చెందిన 72 మందిని బిజ్జంపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. ఎస్టీ కాలనీలో ఇబ్బందులు పడుతున్న ఓ గర్భవతిని అధికారులు వైద్యశాలకు తరలించారు. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని 66 చెరువుల్లో 30 శాతం చెరువులు అలుగు పారుతుండగా మిగిలిన చెరువులు జలకళ సంతరించుకున్నాయి. వరికుంటపాడు మండలం అండ్రావారిపల్లి చెరువు సమీపంలో నివసిస్తున్న 17 మంది గిరిజనులను అధికారులు వరికుంటపాడు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. కనియంపాడు వద్ద పిల్లాపేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు జరగకుండా అధికారులు పహారా కాస్తున్నారు. వింజమూరు మండలంలో కాటేపల్లి గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వింజమూరు-చాకలకొండ మధ్య రాకపోకలు స్తంభించాయి. మండలంలో నాలుగు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంత ప్రజలను అధికారులు తరలిస్తున్నారు. దుత్తలూరు మండలం ఏరుకొల్లు, ముత్తరాశిపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సీతారామపురం మండలంలో వర్షానికి వాగులు, వంకలు పొర్లుతున్నాయి. ఈ వర్షాని వరి, కంది, మినుము పంటలు నేలకొరిగాయి. పొలాల్లో నీరు చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కాటేపల్లి వాగు

ఉధృతంగా కాటేపల్లి వాగు

వింజమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావిత వర్షాలతో మండలంలోని కాటేపల్లి పంచాయతీలో ఉన్న కాటేపల్లివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినప్పటికీ కొందరు వాహన చోదకులు వాగు దాటుతుండడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు చేపట్టి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కోటిగుండాలకు వెళ్లే మార్గంలో కూడా రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో అటువైపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా, వర్షం కారణంగా వింజమూరులో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఓ ఇంటి నుంచి షేక్ పఠాన్ కుటుంబాన్ని అధికారులు పునరావాస కేంద్రానికి తరలించారు. పాతూరు అంగన్‌వాడీ కేంద్రంలో వీరికి ఆశ్రయం కల్పించారు. టీడీపీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గుడ్లూరు అనూష, వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపాల్ రాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముఖేష్, అంగన్‌వాడీ టీచర్ భాగ్యమ్మ ఆ కుటుంబానికి నిత్యావసరాలు అందించారు.

పునరావాస కేంద్రంలో ఎమ్మెల్యే పరిశీలన

ఉదయగిరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరిశీలించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న 50 కుటుంబాలను పరామర్శించి దుప్పట్లు, ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. తుఫాన్ నేపథ్యంలో అధికారులకు తోడుగా నాయకులు ఉంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని కోరారు. తొలుత ఆయన పుల్లాయపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దున్నపోతుల వాగును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీవో శ్రీనివాసులు, సీఐ ఎస్ వెంకటరావు, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహ, పెదవెంకటయ్య, ఏడుకొండలు, మతకాల శ్రీను, శివకృష్ణ, ఈర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నిండుకుండలా శకునాలపల్లి బాపనచెరువు

నీరు నిల్వ లేకుండా చర్యలు

వర్షాల వల్ల ఉదయగిరి పట్టణంలోని పలు వీధులు, రహదారులపై నీరు నిలిచి రాపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో సర్పంచ్ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముర్తుజా సూచన మేరకు పంచాయతీ ఈవో షేక్ కరీముల్లా నీరు నిలబడకుండా చర్యలు చేపట్టారు. మంగళవీధి, సినిమాహాలు వీధి, కోళ్ల వీధి, సచివాలయం-3, యాదవపాళెం, గండిపాళెం మార్గంలో రహదారుల పై నిలిచిన వర్షపు నీటిని ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. గాలులతో నేలకొరిగిన చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పెదమస్తానీ, తిరుపతి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ ఎస్థాని, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



ఉదయగిరి : రహదారిపై నిలిచిన వరద నీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు పంపుతున్న అధికారులు



బీడుపొలాల్లో చేరిన వర్షపు నీరు

చెరువుల్లా భూములు

అనంతసాగరం అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపిలేని వర్షం కురుస్తోంది. వర్షానికి తోడు చలిగాలితో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. మండలంలోని ముత్తుకూరు, కమ్మవారిపల్లి వద్ద ఆత్మకూరు ప్రధాన రహదారిపై ఉన్న వంకల్లో నీటి ప్రవాహంతో రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. పాతదేవరాయపల్లి, కమ్మవారిపల్లి సమీపంలో బీడు భూముల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించాయి. పెన్నాపరీవాహక ప్రాంతమైన కచ్చేరి దేవరాయపల్లిలో ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ పర్యటించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకొన్నారు. ఆమని చిరివేళ్ల ఎస్టీ కాలనీలో 40 కుటుంబాలకు 10 కిలోల చొప్పున బియ్యాన్ని రేషన్ షాపు నుంచి పంచాయతీ కార్యదర్శి నరసింహులు అందజేశారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తమకు సమాచారం ఇవ్వాలని ఎంపీడీవో ప్రజలను కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వింజమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : వింజమూరు జీబీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన అల్లూరు వాసు (23) గత రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సర్పంచ్ నల్లగొండ సృజన భర్త రాయుడు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కాగా, వాసుకు మూడు నెలల క్రితమే వివాహం కావడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మరింత ఆర్థిక సాయం చేస్తామని రాయుడు తెలిపారు.

కావలిని ముంచెత్తిన వర్షం

- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- చెరువులుగా మారిన రోడ్లు
- నిండుకుండల్లా చెరువులు
- వరద ఉధృతితో స్తంభించిన రాకపోకలు

కావలి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కావలి ప్రాంతంలో సోమవారం రాత్రి నుంచి ప్రజ లు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు కూడా అవకా శం లేకుండా ఎడతెరపిలేకుండా వర్షం ముంచెత్తింది. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టాలు జరుగక పోయినా ప్రజల్లో భయం నెలకొంది. గత పక్షం రోజులుగా వర్షాలు పడుతుండటంతోపాటు ప్రస్తుతం గాలులు వీస్తుండడంతో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద చెట్టు పడిపోవటంతో రాకపోకలు స్తంభించగా అధికారులు తక్షణం స్పందించి చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ట్రంకురోడ్డు వాగును తలపిస్తుండగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వైకుంఠపురంలో అన్నపుగుంట ప్రాంతమంతా నీట మునిగి రాకపోకలు స్తంభించాయి. దీంతో అన్నపుగుంట మార్గాన్ని అధికారులు పూర్తిగా బంద్ చేశారు. భారీ వర్షాలకు చెరువులు నిండుకుండలా ఉన్నాయి. వర్షం మరింత పెరిగితే అవి ఎక్కడ తెగిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. డివిజన్‌లో 34 చెరువులు ప్రమాద భరితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించి సిబ్బందిని నియమించారు. అత్యవసరపనులు చేపట్టేందుకు ఎక్స్‌కవేటర్లు, ఇసుకబస్తాలను సిద్ధంగా ఉంచారు. కావలి పెద్దచెరువు తూము ప్రమాదభరితంగా ఉండటంతో దానికి సోమవారం నుంచే రింగ్ బండ్ ఏర్పాటు చేపట్టారు. చలంచర్లచెరువు గట్టు కొంత భాగం దెబ్బతినటంతో వెంటనే మరమ్మతులు చేయించారు.



ముసునూరు ట్రంకురోడ్డులో వాహదారుల అవస్థ



కావలి పెద్దచెరువుకు ఏర్పాటు చేస్తున్న రింగ్‌బండ్

- **పట్టణంలో ఎమ్మెల్యే, అధికారుల పర్యటన**

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావన్ కుమార్, తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్‌లు పర్యటించారు. భారీ వర్షాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. కావలి పెద్ద చెరువు రింగ్ బండ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే దాని పటిష్ఠతపై ఏఈ కిరణ్‌తో చర్చించారు. మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పెంకులఫ్యాక్టరీ స్కూల్‌లోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద పడిపోయిన చెట్టును పరిశీలించి దాని తొలగింపునకు చర్యలు చేపట్టారు. తుమ్మలపెంట రోడ్డులో నీటిని తరలింపునకు తీసిన కాలువలను పరిశీలించారు. ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణ రాంమూర్తిపేట, బుడంగుంట పునరావాస కేంద్రాలను తనిఖీ చేసి వసతులను పరిశీలించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో తహసీల్దార్ పీ.శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆర్డీవో పర్యటించారు. తుమ్మలపెంట తీరంలో సముద్ర ఉధృతిని పరిశీలించారు. అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురంలో లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించి అక్కడి ప్రజలను తుఫాన్ షెల్టర్‌కు పంపే ఏర్పాట్లు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు, వైకుంఠపురంలో ఉన్న అన్నపుగుంట లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించి వరద ముంపు కాకుండా అవసరమై ఏర్పాట్లు చేపట్టారు.



అన్నపుగుంట వైపు వెళ్లే మార్గంలో కట్టిన తాడు

- **ప్రమాదపుటంచున కావలి పెద్ద చెరువు**

కావలి పెద్ద చెరువు తూము వద్ద కట్ట దెబ్బతిని ఉండటంతో దానికి రింగ్‌బండ్ వేసినా ప్రమాదం పొంచి ఉంది. ఎప్పుడో దెబ్బతిన్న కట్టకు వేసవిలో మరమ్మతులు చేయకుండా వదిలివేసిన అధికారులు మొంథా తుఫాన్ తీవ్రతతో హడావుడి చేసి తూము చుట్టూ రెండు రోజులుగా రింగ్ బండ్ వేశారు. రింగ్‌బండ్ తెగితే చెరువు కూడా తెగే ప్రమాదం ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వరదనీరును మళ్లించేందుకు చెరువు అలుగు వద్ద కొంత భాగం పగుల కొట్టారు.

- **రోజంతా వర్షం**

జలదంకి : మొంథా తుఫాన్ ప్రభావంతో మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఈదురుగాలులతో చలికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జలదంకి పంచాయతీ గమళ్లపాలెంలో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సీసీ రోడ్ల నిర్మాణం చేయడంతో కొన్ని గృహాలు రోడ్డుకంటే కిందకు ఉండడంతో వర్షపునీరు బయటకు పోయే వీలులేకుడాపోయింది. విషయం తెలుసుకుని ఉపసర్పంచు కూరపాటి మాలకొండారెడ్డి ఇళ్లలోకి చేరిన నీటిని ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తీయించి బయటకు పంపించారు. చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు కలుజులు పారుతున్నాయి. చినక్రాక, అన్నవరం వైపు కలుజు వాగుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడమే కాక సిబ్బందిని కాపలా ఉంచారు. గోపన్నపాలెం వద్ద జలదంకి-తెల్లపాడు రోడ్డుపై ఊళ్లవాగు పారుతుండడంతో ప్రజలు వాగులోకి దిగకుండా తహసీల్దారు ప్రమీల, ఎస్ఐ లతీఫున్నీసాలు రోడ్డుకు అడ్డంగా మట్టికుప్పలు వేయించి సిబ్బందిని కాపలా ఉంచారు. చామదల నేరెళ్లవాగు, కమ్మవారిపాలెం వాగుల వద్ద కూడా ముందస్తు చర్యలు చేపట్టారు. క్రిష్ణాపాడు సమీపంలో ఉబ్బలవాగు వద్ద పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. జలదంకిలోని చల్లాయానాదుల నివాసా ప్రాంతాన్ని తహసీల్దారు సందర్శించారు.



కావలి పునరావాస కేంద్రంలో ఆర్డీవో వంశీకృష్ణ

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. కలిగిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. కలిగిరి ఎస్టీ కాలనీవాసులకు దుప్పట్లు, ఆహార పొట్లాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రత్యూష, డిప్యూటీ ఎంపీడీవో వెలుగోటి మధు, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం క్రిష్టారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దారు గిరీషకుమార్, ఎంపీడీవో ప్రత్యూష, సీఐ వెంకట నారాయణలు కలిగిరి-సంగం, కలిగిరి-కొండాపురం, కలిగిరి- చిన్న అన్నలూరు మార్గాలలో చప్టాల వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేశారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేష్

జిర్రావారిపాలెంను విభజించొద్దు

కలిగిరి, అక్టోబరు 28(ఆంధ్ర జ్యోతి): ఎన్నో ఏళ్లుగా కలిగిరి పంచాయతీలో విలీనమైన జిర్రావారిపాలెం గ్రామాన్ని విభజించవద్దంటూ గ్రామస్థులు మంగళవారం సచివాలయంలో జరిగిన గ్రామసభలో తేల్చి చెప్పారు. కలిగిరి పంచాయతీ నుంచి తమ గ్రామాన్ని విభజన చేస్తే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని, ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవిచంద్ర, ఉపసర్పంచు కొండారెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, జిర్రా పెద అంకిరెడ్డి, చిన అంకిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



విభజన వద్దని నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

వర్షంతో స్తంభించిన జనజీవనం

లింగసముద్రం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ముత్యాలపాడు ఎస్టీ కాలనీలోకి నీరు చేరింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కే.శ్రీనివాసులు మోటారు ఏర్పాటు చేయించి నీటిని తోడించారు. పెదపవని బస్టాండ్ సెంటర్‌లో పెద్ద వేపచెట్టు నేలకూలింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. వీఆర్ కోట పంచాయతీ బ్రాహ్మణపల్లిలో ఇల్లు కూలింది. గ్రామాల్లో వీధులు, ఆర్‌అండ్‌బీ రోడ్లు జలమయమయ్యాయి. రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిపడ్డారు. బ్రాహ్మణపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు →



ఎడతెరిపి లేని వర్షం

● లోతట్టు ప్రాంతాల జలమయం ● స్తంభించిన జనజీవనం



కందుకూరు : ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కందుకూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. ఈ ప్రాంతంలోని అన్ని మండలాల్లో ఒక్కరోజులోనే సరాసరిన 15 సెం.మీటర్లకు పైగా వర్షపాతం నమోదవటంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కందుకూరు పట్టణంతో పాటు అనేక గ్రామాలలో లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. కందుకూరు ప్రాంతంలో రాళ్లవాగు, ఎర్రవాగు పొంగిప్రవహిస్తుండటంతో పలుమార్గాలలో రాకపోకలు నిలిచిపోయాయి. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు కోటారెడ్డినగర్, సుల్తాన్‌మొహిద్దీన్ నగర్, కేసరిగుంట, కేసరిగుంట కాలనీ, శ్రీనగర్‌కాలనీ, బండపాలెం జనార్ధన ఎస్టీ కాలనీలు జలమయమయ్యాయి. కోటారెడ్డినగర్‌లోని అనేక ప్రాంతాలలో మోకాటిలోతున వర్షపునీరు నిలిచింది. గుణ్ణంకట్ట కుంట పొంగిప్రవహిస్తుండటంతో సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లోని నీరు నిలిచింది. కేసరిగుంట కాలనీ జలమయం అయింది. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. తహసీల్దారు లావణ్య, మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు దగ్గరుండి పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు ఏర్పాట్లును పర్యవేక్షించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు నేతృత్వంలో పేదలకు ఆహార పొట్లాలు, దుస్తులు, చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు రఫీ, గంగిరెడ్డి ఆధ్వర్యంలో శివారుప్రాంతంలో పేదలకు ఆహారపొట్లాల పంపిణీ చేశారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో మాచవరం, మోపాడు గ్రామాలలో సాగుచేసి కోత దశలో ఉన్న వరిపైరుకు తీవ్రనష్టం వాటిల్లింది. మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీం మాచవరంలో వరి పైరును పరిశీలించి నష్టం అంచనాలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.



కావలిరూరల్ : సర్వీస్ రోడ్డులో నీరు



కొండాపురం : పర్యవేక్షిస్తున్న అధికారులు

● **బిట్రగుంట :** బోగోలు మండలంలో మంగళవారం ఎడతెరిపి లేని కుండపోత వర్షం కురుస్తుంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద సముద్ర అలలు సుమారు 10 నుంచి 14 అడుగుల ఎత్తు ఎగసి పడుతున్నాయి. తాటిచెట్లపాలెం సముద్రతీరంలో అలలు ఉధృతంగా వీస్తుండటంతో తీరం కోతకు గురైంది. జక్కేపల్లిగూడూరు, కడనూతల, బోగోలు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. పాతబిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట గిరిజన కాలనీలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. సాయంత్రం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా ఏఈ జడరాయ చర్యలు చేపట్టారు. తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఆర్‌ఐ రామకుమారిలు ఎస్వీపాలెం, సీఆర్‌పాలెం, తాటిచెట్లపాలెంలో పర్యటించారు. తీరప్రాంతం లో కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్‌ఐ ప్రభాకర్ పర్యటించారు.

● దగదర్తి తహసీల్దారు కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ జంపాని కుమార్‌లు వేర్వేరుగా పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు గిరిజన కాలనీకి చెందిన 90 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతవరంకు వచ్చిన కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ గిరిజనులను కలిసి మాట్లాడారు. అలాగే దగదర్తి గ్రామ పరిసర ప్రాంతాల వారిని జడ్పీ ఉన్నత పాఠశాలకు తరలించారు. టీడీపీ మండల యువత అధ్యక్షుడు వడ్డే వినయ్‌కుమార్ పండ్లు, బిస్కెట్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలయ్య, వీఆర్‌ఏలు శ్రీనివాసులు, సునీత, యువత ముప్పాళ్ల తరుణ్ తదితరరులు పాల్గొన్నారు.

● **కావలి రూరల్ :** మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీర ప్రాంతాలను ఆర్డీవో సన్నీ వంశీక్రిష్ణ, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, రూరల్ సీఐ రాజేశ్వరరావులు పర్యటించి లోతట్టు ప్రాంతాల్లో పేదలను పునరావాస కేంద్రాలకు తరలించారు. బుడంగుంట ఎస్టీ కాలనీ, అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురం, లక్ష్మీపురం గ్రామాలల్లో పూరిగుడిసెల్లో నివశించే గిరిజనులను పునరావాస కేంద్రాలకు తరలించారు. మద్దూరుపాడు టిడ్కో గృహాల సముదాయాలలో నిల్వచేరిన వర్షపు నీటిని, జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వచేరి హైవే పైకి చేరుతుండటాన్ని గుర్తించిన సీఐ ఎక్స్‌వేటర్ తో కాలువలు తీయించి పక్కకు మళ్లించారు.



బిట్రగుంట : తాటిచెట్లపాలెంలో ఎగసిపడుతున్న సముద్రపు అలలు

● **అల్లూరు :** తుఫాన్ ధాటికి తీరప్రాంత మండలమైన అల్లూరులో సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. ఈదురుగాలులకు చెట్లు ఊగిపోయాయి. ఇస్కపల్లిలో సము ద్రం అల్లకల్లోలంగా ఉండడంతో అధికార యం త్రాంగం ఎవ్వరినీ సముద్రం వద్దకు వెళ్లనీయకుండా చర్యలు చేపట్టారు.

● **కొండాపురం :** మండలంలో వాగులు, వంకలు పొంగి చెరువులన్నీ దాదాపుగా నిండాయి. తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో ఆదినారాయణరావు, ఎస్‌ఐ మాల్యాద్రిలు ప్రమాదకరంగా ఉన్న సాయిపేట చెరువును పరిశీలించారు. కొండాపురం-శేణమాల మధ్య ఉప్పుటేరు, కొమ్మి దగ్గర గండికట్ల చెరువు అలుగు, సత్యవోలు వద్ద మిడతవాగు, చింతలదీవి వద్ద ఉప్పుటేరులనే అధికారులు పరిశీలించారు. శాయిపేట పంచాయతీలోని కొమ్ముపాలెంలో రోడ్లపై నీరు నిలవడంతో అక్కడకువెళ్లిన అధికారులు, జిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ డైరెక్టరు తాటికొండ అనూష 10 కుటుంబాలకు ఆహార పొట్లాలు అందజేశారు. కార్యదర్శి ప్రదీప్, ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్, నేతలు ప్రవీణ్, వల్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజకీయ చైతన్యంతోనే బీసీల అభ్యున్నతి

● మాజీ ఎమ్మెల్సీ బీదా/బూదాటి

కావలి(టౌన్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యంతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధాకృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని ఈడెన్ గార్డెన్స్ హాల్‌లో బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ అధ్యక్షతన మొదటి వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాధాకృష్ణయ్య మాట్లాడుతూ బీసీలు ఆర్థికంగా రాజకీయంగా ఎదిగినప్పుడే అసలైన అభివృద్ధి అన్నారు. చివరగా రాధయ్యను వివిధ బీసీ కులాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ భవన్ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి చిన్నివరప్రసాద్, గౌరవాధ్యక్షుడు గోవిందు, మాజీ జెడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, బీజేపీ నేత కుట్టుబోయిన బ్రహ్మానందం, బీసీ సంఘాల నేతలు బాలజీ, గోపాల్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బూదాటిని సత్కరిస్తున్న నేతలు

అంకమ్మ ఆలయ ప్రాంగణంలో గదుల నిర్మాణానికి హైకోర్టు బ్రేక్!



నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

కందుకూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామ దేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో ఎటువంటి నిర్మాణాలు చేయరాదని, ఆలయానికి ఉన్న 1.52 ఎకరాలను దైవిక కార్యక్రమాల నిర్వహణలో భక్తుల సౌకర్యం కోసం ఉంచాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మవారి ఆలయ ఆదాయం పెంపే లక్ష్యంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వల్ల భక్తులకు అసౌకర్యం కలుగుతుందని అందువల్ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని తానికొండ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన కోర్టు కొంతకాలం నిర్మాణాలపై స్టే విధించాక గతనెల 29న స్టే ఎత్తివేస్తూ షాపులు, భవనాలు నిర్మాణాలు చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. గదుల నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే సెలవులు, వర్షాలకారణంగా ఆ జడ్జిమెంట్ కాపీ రావటం ఆలస్యం కావటంతో గత 20 రోజులుగా షాపుల నిర్మాణం వేగంగా జరుగుతోంది. అయితే ఆలయ ఈవో కార్తీక్ మంగళవారం కూడా ఆలయ ప్రాంగణం 1.52 ఎకరాలలో మాత్రమే నిర్మాణాలు వద్దని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే మొత్తం ప్రాంగణం 2.30 ఎకరాలు అయినందున మిగిలిన 78 సెంట్లులోనే షాపుల నిర్మాణం జరుగుతుందని, దీనికి ఎలాంటి ఆటంకం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే సాంకేతికంగా రూములు నిర్మాణం జరుగుతున్నది ఆలయానికి చెందిన 1.52 ఎకరాలలోని స్థలంలో అయినందున ఈవో నిర్ణయం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని పిటీషన్‌దారులు విమర్శిస్తున్నారు. ఈవో, ఇతర బాధ్యులపై కోర్టు ధిక్కారణ పిటీషన్ దాఖలుచేస్తామని చెబుతున్నారు.

కారు డ్రైవరు మృతితో కావలిలో విషాదం



రవికుమార్ (ఫైల్)

కావలి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డు ఎస్సీ కాలనీకి చెందిన కారు ఒనర్ కం డ్రైవర్ గండూరి రవికుమార్(56) మంగళవారం తిరుపతి జిల్లా నాయుడుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం పోషణ కోల్పోయింది. సీనియర్ డ్రైవర్‌గా, అయ్యప్ప గురుస్వామిగా పట్టణంలో మంచి పేరు తెచ్చుకున్న రవికుమార్ 2014-19 టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ నుంచి కారు రుణం పొంది కుటుంబాన్ని పోషించుకొంటున్నాడు. తన పెద్ద కుమారుడు మణికంఠను ఆయుర్వేద వైద్యుడిని చేశాడు. చిన్న కుమారుడు బాలసుబ్రహ్మణ్యం బీఎస్సీ నర్సింగ్ చేస్తున్నాడు. అందరి తో కలివిడిగా ఉండే రవికుమార్ మృతితో ఎస్సీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య స్వర్ణలత, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అయ్యప్ప మాలలో ఉన్న రవికుమార్ మృతి పట్ల స్టాండ్‌లోని కారు డ్రైవర్లు సంతాపం తెలిపారు.



మబ్బులు ముంచిపోసినట్లు...

బాహుబలి సినిమాలో రాజమౌళి గ్రాఫిక్ మాయాజాలాన్ని కంటిముందు ఆవిష్కరిస్తోంది తిరుపతిలోని కపిలతీర్థం జలపాతం. నింగిలోంచి నేలకు దూకుతున్నట్టుగా కనిపించి అలరిస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తప్పిన 'మొంథా' ముప్పు!



● తుఫాను ప్రభావంతో భారీ వర్ష సూచన ● 24 గంటలుగా ఒకటే వాన



జిల్లాకు మొంథా తుఫాను ముప్పు తప్పింది. అయితే దాని ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరోవైపు సోమవారం రాత్రి నుంచీ మంగళవారం సాయంత్రం వరకూ ఆగకుండా వర్షాలు కురుస్తున్నాయి. తేలికపాటి వర్షాలు కావడంతో జిల్లాలో పెద్దగా ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో ఆగని వర్షం


జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి మంగళవారమంతా ఒక మోస్తరు వర్షం పడుతూనే ఉంది. దీనికి ఈదురుగాలులు తోడవడంతో చలితీవ్రత పెరిగింది. తిరుమలలో భక్తులు చలికి వణికిపోయారు. తిరుపతి రుయాస్పత్రిలోనూ రోగులకు అవస్థలు తప్పలేదు.

కూలిన ఇళ్లు.. చెట్లు

- ఏర్పేడు మండలం నచ్చినేరి ఎస్టీ కాలనీలో చిన్న తంబి, నాగరాజులకు చెందిన పూరిగుడిసెలు కూలిపోయాయి.
- రేణిగుంట-తిరుపతి నడుమ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.
- తిరుమల బాలాజీనగర్‌లో భారీ వృక్షం అక్కడి కారుపై పడింది. మరో చెట్టు వాలిపోవడంతో రెండు ఇళ్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఎస్ఎస్సీ కాటేజీల వద్ద కూడా మరో వృక్షం కూలిపోయింది.
- పెళ్లకూరు మండలం పాలకూరు ఎస్టీ కాలనీలో యాకసిరి సునీత, తుపాకుల రంగమ్మలకు చెందిన పూరి గుడిసెలు కూలిపోయాయి.
- ఏర్పేడు మండలం చిన్న అంజిమేడులో చిత్తనూరు గీత కుటుంబానికి చెందిన పాడియావు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది.



తిరుపతి నగరం పాత ప్రసూతి ఆస్పత్రి రోడ్డులో కూలిన భారీ వృక్షం



కోట మండలం తిన్నెలపూడి వద్ద వరదనీటితో పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖినది

- జిల్లావ్యాప్తంగా 2756 చెరువులకు గానూ 300 చెరువులు పూర్తిగా నిండాయి. మరో 500 చెరువుల్లో ముప్పాతిక వంతు నీరు చేరింది. ●వెంకటగిరి మండలం కైవల్య నదిలో ప్రవాహం మొదలైంది. ●నాగలాపురం మండలం సురుటిపల్లి వద్ద అరుణానదిలో ఆరు అడుగుల మేరకు నీరు ప్రవహిస్తోంది.
- కేవీబీపురం మండలం ఒళ్ళూరు రాయల చెరువు నిండి కలుజు పారుతోంది.
- స్వర్ణముఖి నది ఉధ్రుతంగా ప్రవహిస్తోంది.

ఇళ్ళలోకి వర్షపు నీరు

- తిరుపతి లింగేశ్వరనగర్ నీట మునిగింది.
- శ్రీకాళహస్తి పట్టణం బీపీ అగ్రహారం రామాలయం వీధి జలమయమైంది. ఇళ్ళలోకి నీరు ప్రవేశించింది.
- డక్కిలి మండలం దగ్గవోలు గిరిజన కాలనీలో గుడిసెల్లోకి నీరు చేరింది. దీంతో వారిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రానికి తరలించారు.
- గూడూరు మండలం విందూరు ఎస్టీ కాలనీ వాసులను.. ఓజిలి మండలం గ్రద్దగుంట గిరిజన కాలనీ.. పెళ్ళకూరు మండలం కానూరు ఎస్టీ కాలనీ.. సత్యవేడు మండలం బాలగోపాలపురం ఎస్టీ కాలనీ.. వరదయ్యపాలెం మండలం బీజీఆర్ ఎస్టీ కాలనీ, పాండూరు నక్కలమిట్ట ఎస్టీ కాలనీ ప్రజలను ముందుజాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించారు.



భైరవగుంట చెరువుకు గండి

బీఎన్ కండ్రిగ మండలం కుక్కంబాకం భైరవగుంట చెరువుకు తూము వద్ద గండి పడింది. దీంతో నీరంతా వెలుపలికి ప్రవహిస్తోంది.

11 మండలాలకు భారీ వర్ష హెచ్చరిక

తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచీ బుధవారం వరకు 11 మండలాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదముందని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. సముద్ర తీర మండలాలు, తీరానికి చేరువగా ఉన్న మండలాలైన గూడూరు, వాకాడు, కోట, చిల్లకూరు, చిట్టమూరు, ఓజిలి, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట, తడ, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని జిల్లా యంత్రాంగం హెచ్చరించింది. దానికి తగ్గట్టుగానే మంగళవారం మధ్యాహ్నం నుంచే జిల్లావ్యాప్తంగా గాలుల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా సముద్ర తీరానికి చేరువలో వున్న మండలాల్లో ఈదురుగాలులు బలంగా వీస్తున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, ప్రత్యేకాధికారి అరుణ్‌బాబు మంగళవారం వాకాడు, చిల్లకూరు మండలాల్లోని సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించారు.

ఆగిన రాకపోకలు.. బస్సు సర్వీసుల రద్దు



సూళ్ళూరుపేట మండలం దొండకాలువ వంతెనపై రెండడుగుల మేర ప్రవాహం

- తిరుపతి, సత్యవేడు, గూడూరు, వాకాడు, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం పది మార్గాల్లో 19 బస్సు సర్వీసులు రద్దయ్యాయి.
- మూడు మార్గాల్లో రోడ్లు పాడవడంతోనూ, మిగిలిన మార్గాల్లో కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతోనూ బస్సు సర్వీసులు నిలిపివేశారు.
- వరదయ్యపాలెం సీఎల్ఎన్ పల్లి పంచాయతీలో వాగు ప్రవాహ ఉధృతి పెరగడంతో రోడ్డు బ్రిడ్జిపైకి వరద నీరు చేరింది. దీంతో రాకపోకలు ఆపేసి కాపలా ఏర్పాటు చేశారు.
- కేవీబీపురం మండలం పూడి గ్రామాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు కొట్టుకుపోయింది.
- ఏర్పేడు మండలం కొత్తవీరాపురం- మోదుగులపాలెం నడుమ స్వర్ణముఖి నది ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిపివేసి పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.
- ఏర్పేడు మండలం గుడిమల్లం వద్ద సీత కాలువ ఉధృతి పెరగడంతో ఆలయానికి భక్తుల రాకపోకలను ఆపేశారు.
- వెంకటగిరి మండలం వెలిగొండ కొండల్లోని మల్లేశ్వర కోనకు భక్తులను అనుమతించకుండా పోలీసులు దారి మూసేశారు.

'మొంథా'పై అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్



తీరప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు


చిట్టమూరు, అక్టోబర్ 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన ఎస్పీ సుబ్బరాయుడు, జిల్లా ప్రత్యేకాధికారి అరుణ్‌బాబుతో కలసి తీరప్రాంత గ్రామాల్లో పర్యటించారు. 'వాతావరణ సూచన ప్రకారం తుఫాన్ తీరం దాటే సమయానికి 60 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. వరద ప్రవాహమున్న కాజ్‌వేల వద్ద ప్రజలు రాకపోకలు సాగించొద్దు. చెరువు కట్టలు బలహీనంగా ఉన్న ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖను ఆదేశించాం. నీట మునిగిన పంటలను గుర్తించాలని సూచించాం. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు. ఆస్తి, ప్రాణ నష్టం జరకుండా యంత్రాంగం సన్నద్ధంగా ఉంది' అని కలెక్టర్ తెలిపారు. చిట్టమూరు మండలం యల్లసిరి మేజర్ చెరువు కట్టలను పరిశీలించారు. గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను చూసి రైతులతో మాట్లాడారు. చిట్టమూరు నుంచి ముట్టెంబాకు వెళ్లే మార్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. మల్లాం మార్గంలో వరద తాకిడి ఉన్న కాజ్‌వేల వల్ల గతేడాది ఇద్దరు కొట్టుకుపోయి మృతి చెందినట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. ఆయన వెంట గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి, గూడూరు డీఎస్పీ గీతా కుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరావు ఉన్నారు.



కోట మండలం గూడలి వద్ద నీటమునిగి చెరువులా మారిన వరినారుమడులు

● ప్రాజెక్టు రిపోర్టు

కాళంగి గేట్లు మూసివేత



తిరుపతి/కేవీబీపురం/రేణిగుంట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం లోతు 224 అడుగులు. మంగళవారానికి 217 అడుగుల నీటి మట్టం ఉంది. దీంతో గేట్లను మూసేశారు. ఒకవేళ మంగళవారం రాత్రికి నీటి మట్టం పెరిగితే 1, 2 గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

- రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంలో మంగళవారం ఉదయం 8 గంటలకు 800 క్యూసెక్కుల నీళ్లు చేరుతోంది. దీంతో గేట్లను ఒక అడుగు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు వదులుతున్నారు.
- వాకాడు మండలం స్వర్ణముఖి బ్యారేజీలోకి 3500 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7 గేట్లు ఎత్తివేశారు.
- పిచ్చాటూరు మండలం అరణియార్ రిజర్వాయరులో 31 అడుగులకుగాను 28.7 అడుగులకు నీటి మట్టం చేరింది. 450 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుండగా రెండు గేట్లు ఎత్తివేసి 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.
- చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లో 867 అడుగుల వరకూ నీటి మట్టం పెరిగింది.

గూడూరులో అత్యధికం 72.8మి.మీ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి 8గంటల వరకు సగటు వర్షపాతం 26.7మి.మీ. నమోదైంది. అత్యధికంగా గూడూరులో 72.8మి.మీ., అత్యల్పం పాకాల 8మి.మీ. వర్షపాతం నమోదైంది. చిల్లకూరు 57.6, కోట 51.8, ఓజిలి 49.6, వాకాడు 52.6, నాయుడుపేట 42.2, చిట్టమూరు 43.4, బాలాయపల్లి 36.2, డీవీసత్రం 31, పెళ్లకూరు 27, తడ 26, డక్కిలి 29, వెంకటగిరి 25.4, సత్యవేడు 23.4, సూళ్ళూరుపేట 23, శ్రీకాళహస్తి 22.8 మి.మీ. చొప్పున.. దాదాపు 17మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

రూ.240కోట్ల ఆస్తినష్టం

మొంథా తుపాన్‌తో దాదాపు రూ.240కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు జిల్లా అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. 17ఇళ్లు దెబ్బతినగా ఆరు పూడిగుడిసెలు నేలమట్టం అయాయి. మొత్తం 37 మూగజీవాలు మృతిచెందాయి. 13మండలాల్లో దెబ్బతిన్న పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు రూ.2.4కోట్లు అవసరం. ఆర్ అండ్‌బీకి 42 రోడ్లు దెబ్బతిన్నాయి. ఏపీఎస్పీడీఎసీఎల్‌కు సంబంధించి 126 కరెంటు స్తంభాలు.. 4.55కిలోమీటర్ల 11కేవీ వైర్లు దెబ్బదిన్నాయి. సుమారు రూ.57లక్షల మేర నష్టం వాటిల్లింది. జిల్లాలో 20 తుఫాన్ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో 2, శ్రీకాళహస్తిలో 9, గూడూరు 4, సూళ్ళూరుపేట 5చొప్పున మొత్తం 20 పునరావాసకేంద్రాలను ఏర్పాటుచేశారు. 285 కుటుంబాలకు చెందిన 728మంది ఆశ్రయం పొందుతున్నారు.

రూ.25 కోట్లతో కాణిపాకంలో వసతి సముదాయం

● టీటీడీ ఆస్పత్రులకు డాక్టర్ జగదీష్ ఒక్కరే డైరెక్టర్

● స్విమ్స్ ఆధ్వర్యంలోనే మెడికల్ షాప్ ● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద యాత్రికుల వసతి సముదాయం, ఏసీ, నాన్ ఏసీ కల్యాణమండపాల నిర్మాణానికి రూ.25 కోట్లు కేటాయించినట్టు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. నిధులు టీటీడీనే కేటాయించినప్పటికీ నిర్మాణం, నిర్వహణ కాణిపాకం ట్రస్టు బోర్డుదే బాధ్యతన్నారు. ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని నిర్ణయించామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి మీడియాకు వెల్లడించారు. స్విమ్స్ పరిధిలోని కొన్ని మెడికల్ షాప్‌లు డూప్లికేట్ మెడిసిన్స్ విక్రయిస్తున్నట్లు పలు ఫిర్యాదులు వచ్చిన క్రమంలో స్విమ్స్ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తే బాగుంటుందని నిర్ణయించామన్నారు. శ్రీవాణి ట్రస్టు దాతలు టికెట్లు తీసుకునేందుకు దాతలు ఇబ్బంది పడుతుండటంపై చర్చించామని, పదిరోజుల్లో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. టీటీడీలో కాంట్రాక్ట్ లెక్చరర్లు, డ్రైవర్ల క్రమబద్ధీకరణపై గత తీర్మానం సరైన పద్ధతిలో లేకపోవడంతో తాజాగా మరోసారి తీర్మానించామన్నారు. సీఎం ఆదేశాల మేరకు టీటీడీ పరిధిలోని ఆస్పత్రులకు డాక్టర్ జగదీష్ డైరెక్టర్‌గా ఉంటారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఏఐ ద్వారా శ్రీవారి దర్శనాల అమలుపై ఇప్పటికే ఓ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, మరికొన్నింటి వినియోగంపై కమిటీని నియమించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన టీటీడీ శాశ్వత ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారికి రూ.7,535 చొప్పున బహుమానం ఇవ్వాలని తీర్మానించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో పనిచేసిన తిరుమల, తిరుపతికి చెందిన సిబ్బందికి అదనంగా రూ.10 శాతం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. నవంబరు 17 నుంచి 25వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



యువత, కౌమార అభివృద్ధి జాతీయ పథకానికి

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత, కౌమార అభివృద్ధి జాతీయ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్నుట్లు సెట్విన్ సీఈవో డాక్టర్ యశ్వంత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. లాభాపేక్షలేని ప్రభుత్వేతర సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందేందుకు ఇదో చక్కటి అవకాశమన్నారు. అర్హులు నవంబరు నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9848543976నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన మైనార్టీ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ ఆర్థిక సంస్థ ఈడీ హరినాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులై, రెండేళ్ల అనుభవమున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8712655686ను సంప్రందించాలని తెలిపారు.

తిరుమల అడవుల్లో అరుదైన బల్లి

● వెంకటాద్రిగా నామకరణం



మంగళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లిజాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లిజాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కత్తకి చెందిన రెప్టిల్లా విభాగం, ఒడిస్సాలోని ఫకీర్ మోహన్ యూనివర్సిటీల శాస్త్రవేత్తల బృందం శేషాచలం అడవుల్లో దీనిని గుర్తించింది.

శ్రీవారిసేవలో ప్రముఖులు





అభిమానితో సెల్ఫీ తీసుకుంటున్న అజిత్ - అన్మోల్ అంబానీ, క్రిషా షా అంబానీ దంపతులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో, తమిళ హీరో అజిత్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీ, ఆయన సతీమణి క్రిషా షా అంబానీ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,842

తలనీలాలు సమర్పించినవారు: 25,125



వాన.. గాలి.. చలి!



తిరుమలకు శ్రీనివాసుడి దర్శనానికి వస్తున్న భక్తులకు విడవని వానలతో అవస్థలు తప్పడంలేదు. తల తడవకుండా గొడుగు విప్పితే ఈదురు గాలులకు తిరగబడిపోతున్నాయి. మరోవైపు చలి వణికిస్తోంది. ఆలయం పరిసరాల్లో మంగళవారం పగలు కనిపించిన దృశ్యాలు ఇవి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి ఆంధ్రజ్యోతి

అత్యవసర వేళ విధులకు డుమ్మా!

● పలు సచివాలయాలకు తాళాలు

● అందుబాటులో లేని అధికారులు, ఉద్యోగులు

● కలెక్టర్ పరిశీలనలో వెల్లడి



తడ మండలం పూడి సచివాలయానికి తాళాలు వేసి ఉండటాన్ని సెల్‌ఫోన్ లైటింగ్‌లో చూపుతున్న తహసిల్దారు

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను ముంచుకొస్తున్న అత్యవసర వేళ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిన పలువురు అధికారులు, ఉద్యోగులు డుమ్మా కొడుతున్నారు. గ్రామ సచివాలయాలకే కాదు మండల స్థాయి కార్యాలయాలకూ తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తే పలువురు అందుబాటులో వుండడం లేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలనలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తుఫాను నేపథ్యంలో సోమవారం రాత్రి ఎంపీడీవోలు, తహసిల్దార్లు కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులూ విధుల్లో వుండాలని ఐదుగురికి చొప్పున డ్యూటీ వేశారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చిత్తూరు, నెల్లూరు జడ్పీల సీఈవోలతో కలసి మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిట్టమూరు ఎంపీడీవో స్థానికంగా లేరని, వాకాడులో ఉన్నట్లు గుర్తించారు. చిల్లకూరు ఎంపీడీవో అందుబాటులోకి రాలేదు. పుత్తూరు అధికారి తిరుపతిలో ఉన్నట్లు, సూళ్లూరుపేట స్పెషలాఫీసర్ సైతం అందుబాటులో లేరని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు విషయం ఒకరి నుంచీ ఒకరికి సమాచారం వెళ్లడంతో అందుబాటులో లేని అధికారులూ ఉరుకుల పరుగుల మీద కార్యాలయాలకు చేరుకున్నట్టు సమాచారం.

సచివాయాల్లోనూ అదే తీరు

ఇక సచివాలయాల్లో పరిస్థితి ఎలా ఉందోనని జిల్లా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేశారు. తడ తహసిల్దారు రాత్రి 10.24 గంటలకు పూడి సచివాలయానికి వెళ్లగా తాళాలు వేసుంది. తర్వాత కారూరు సచివాలయానికి వెళ్లగా అక్కడ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది లేకపోగా తుఫాను డ్యూటీతో సంబంధం లేని ఓ ఉద్యోగి మద్యం మత్తులో నిద్రిస్తున్నట్టు గుర్తించారు. ఆపై పెరియవట్టు సచివాలయానికి వెళ్లగా, అక్కడా తాళాలు వేసి ఉంది. చివరగా అండగుండాల సచివాలయం చేరుకోగా అక్కడే తాళాలే కనిపించాయి.

కలెక్టర్ ఆగ్రహం

సోమవారం రాత్రి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తుఫాను విధులకు డుమ్మా కొట్టడం పట్ల కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రాత్రింబవళ్ళు సమస్యాత్మక ప్రాంతాలు తిరుగుతుంటే క్షేత్రస్థాయిలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారంటూ వారిని తీవ్రంగా మందలించినట్టు సమాచారం. విధులకు డుమ్మా కొట్టిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిసింది.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో బుధవారం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ముఖ్యంగా చిట్టమూరు, ఓజిలి, కోట, వాకాడు, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, ఏర్లు, కాజ్‌వేల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా స్పెషలాఫీసర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ కంట్రోల్‌రూమ్‌కు వచ్చే అత్యవసర సమాచారాన్ని అధికారులకూ తెలియజేయాలన్నారు. డీఆర్వో నరసింహులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరు రైల్వేస్టేషన్‌లో సేద తీరుతున్న ప్రయాణికులు

విశాఖ- తిరుపతి మార్గంలో పలు రైళ్లు రద్దు

గూడూరు/తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తిరుపతి నుంచి వైజాగ్ వెళ్ళే పలు రైళ్ళు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. పూరీ ఎక్స్‌ప్రెస్ 30వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. మంగళవారం బయలుదేరాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-కాకినాడల మధ్య నడుస్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశామని పేర్కొన్నారు. తిరుపతి-విశాఖ మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు. దీంతో గూడూరు రైల్వే జంక్షన్ నుంచి ప్రయాణించేవారు ఇబ్బంది పడ్డారు. ఆయా రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు.

వర్ష ప్రభావ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన



తిరుపతి గొల్లవానిగుంటలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రామచంద్రాపురం మండలం రామాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇల్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



విడవని వర్షం నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి ఎస్టీకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి



సూళ్లూరుపేట మండలంలోని దొండకాలువ వంతెనపై ప్రవాహ ఉధ్రుతిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



ముసురువానతో ఇబ్బంది పడుతున్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఎస్టీ కాలనీవాసులకు ఆహారాన్ని అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భారీ వాహనాల రాక పోకలపై ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. మంగళవారం రాత్రి7గంటల నుంచి భారీ వాహనాలను జాతీయ రహదారుల వెంట ఉన్న హోల్డింగ్ ప్రాంతాల్లో ఆపుతున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసమే ఈ ఆంక్షలని స్పష్టంచేశారు. తక్షణ సాయం కోసం డయల్ 112 లేదా వాట్సాప్ నెంబరు 8099999977 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

భయం గుప్పెట్లోనే తీరప్రాంతాలు

● బిక్కుబిక్కుమంటున్న స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాలు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సముద్రతీరప్రాంత..మత్స్యకార గ్రామాలు భయం గుపెట్లోనే ఉన్నాయి. మంగళవారం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం గ్రామాల్లో సముద్రం అలజడులతో ఆందోళన చెందారు. గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కసురుపై ఉంటూ పెద్ద ఎత్తున అలలు వచ్చాయి. నాలుగో రోజూ చేపలు పట్టేందుకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేదు. 12 గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంచార జీవులను కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేర్చి వారికి సహాయక చర్యలు చేస్తున్నారు.

తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోయిన షరీఫ్ మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పసివాడి ప్రాణాలు కాపాడాలన్న తపనతో కాలువలో దూకి కొట్టుకుపోయిన డ్రైవర్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఈనెల 26న ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు జలాశయం సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఇరిగేషన్ ఏఈ బాబు తన కారు కడగడానికి మనవడు మహిత్, డ్రైవర్ షరీఫ్‌తో వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలువలో పడిపోవడంతో రక్షించడానికి దూకిన షరీఫ్ కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈక్రమంలో ఈనెల 27న సోమవారం మహిత్ మృతదేహం లభ్యం కాగా మంగళవారం చెట్టుకు ఇరుక్కున్న షరీఫ్ మృతదేహాన్ని ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. కాగా షరీఫ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబీకులు భోరున విలపించారు.

పరకామణి చోరీ ఘటనపై హైకోర్టులో మరో పిల్

● రవికుమార్ వ్యవహారంపై సీబీఐ లేదా రిటైర్డు జడ్జితో విచారణ జరపాలన్న శాప్ ఛైర్మన్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో రవికుమార్ చోరీకి పాల్పడిన వ్యవహారం అంతకంతకూ వేడెక్కుతోంది. ఇప్పటికే దీనిపై దాఖలైన ఓ ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరుపుతుండగా తాజాగా మరో పిల్ దాఖలైంది. ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరపాలని కోరుతూ ఈసారి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హైకోర్టును ఆశ్రయించారు. కోట్లాది మంది భక్తుల కానుకలకు, మనోభావాలకు సంబంధించిన ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఏపీ పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. లేకుంటే సీబీఐకి లేదా రిటైర్డు హైకోర్టు జడ్జితో విచారణ కమిషన్ అయినా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పరకామణిలో చోరీ ఘటనపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 24-2023 క్రైమ్ నంబరుతో నమోదైన కేసును తిరుపతి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగివుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవంగా ఏమి జరిగిందో తేల్చేందుకు లోతుగా సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరముందని, ఆ దిశగా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రవి నాయుడు దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని, సీబీఐని, ఏపీ ప్రభుత్వాన్ని, దేవదాయ శాఖను, హోమ్ శాఖను, డీజీపీని, టీటీడీ ఈవో, టీటీడీ సీవీఎస్వోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. రవినాయుడు మంగళవారం దాఖలు చేసిన పిల్‌పై ఆయన తరపున సీనియర్ న్యాయవాదులు మెస్సర్స్ ఉమేష్ చంద్ర, వడ్డి సోమశేఖర్, కర్రా మాధవి, కె.హరికృష్ణ తదితరులు హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

భార్య ఆచూకీ కోసం వెతుకులాట

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన భార్య కోసం 20రోజులుగా వెతుకుతున్నాడో భర్త. బాధితుడు పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు వివరాలిలా... మహబూబ్ నగర్ జిల్లా కొత్తూరు మండలం మేకగూడకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి విజయలక్ష్మి, దంపతులు ఈ నెల 6న తిరుమల వచ్చారు. దర్శనానంతరం వీరు ట్యాక్సీలో తిరుపతి చేరుకున్నారు. నగరంలోని గరుడ వంతెన మూడో పిల్లర్ వద్ద ట్యాక్సీ దిగారు. ట్రాఫిక్ రద్దీలో రోడ్డు దాటుతుండగా విజయలక్ష్మి కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన చంద్రశేఖరరెడ్డి దాదాపు వారం రోజుల పాటు వెతికారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 16న ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం లేని తన భార్య ఆచూకి కోసం అప్పటి నుంచి ఆమె భర్త కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాడు. పోలీసులను ప్రాధేయపడుతూనే ఉన్నాడు. ఇంతవరకూ వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని చంద్రశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గొడుగుల కింద వ్యాపారం



మంగళవారం జడివాన కురుస్తుండటంతో తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో వ్యాపారులు ఇలా గొడుగుల కింద వ్యాపారం చేశారు. కొనుగోలుదారులు గొడుగులు వేసుకుని రాగా.. మరికొందరు తడిచిపోయారు.

లోపలకు వెళ్లొద్దు



కొద్ది రోజులుగా తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎవరినీ లోపలకు వెళ్లనీయకుండా ఇలా బారికేడ్లు పెట్టారు.

వెంటాడిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో కావలికి చెందిన రవికుమార్(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... కావలికి చెందిన రవికుమార్ కారును డ్రైవ్ చేసుకుంటూ మంగళవారం తెల్లవారుజామున చెన్నైకు బయలుదేరాడు. గూడూరు సమీపంలోని పారిచర్లవారిపాళెం వద్ద వేచివున్న ప్రయాణికుడు జావిద్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ఆగిఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. చిన్నపాటి గాయాలతో బయటపడ్డ రవికుమార్, జావిద్ బయటకు వచ్చి కారును పరిశీలిస్తుండగా ఆ మార్గంలో వెళ్తున్న మరో లారీ రవికుమార్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐసీఎస్ ఎంపిక పోటీలు వాయిదా

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆలిండియా సివిల్ సర్వీస్(ఏఐసీఎస్) క్రీడా పోటీలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈమేకు సంబంధిత సివిల్ సర్వీస్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు!



విచారణాధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి

రేణిగుంట అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. ఈ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. నెల్లూరు డీఐజీ మునిశంకరయ్య నేతృత్వంలో అధికారుల బృందం మధ్యాహ్నం 11.30 నుంచి 1.30 గంటలదాకా కంప్యూటర్లలోని సమాచారాన్ని పరిశీలించారు. ఈసమయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి వారి వెంటే ఉన్నారు. కొందరు ప్రయివేటు వ్యక్తులు కూడా కార్యాలయంలో ఉన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం: కలెక్టర్



తూపిలిపాళెం సముద్రతీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌బాబు, ఎస్పీ సుబ్బరాయుడు

వాకాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను అన్ని విధాలుగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం వాకాడు మండలంలోని తుపిలిపాళెం సముద్రతీరాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా తుఫాన్ ప్రత్యేక అధికారి అరుణ్‌బాబు, ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. మంగళవారం రాత్రి తుఫాన్ తీరం దాటనునండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలకు తగిన వసతి కల్పించాలన్నారు. కాగా, తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలలు ఎగిసిపడుతున్నాయి. అధికారుల హెచ్చరికలతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. సముద్రతీరం వద్ద పోలీసులు, రెవెన్యూ, మెరైన్ పోలీసుల నిఘాలోనే ఉంది. కార్తీకమాసం కావడంతో పర్యాటకులు, భక్తులు సముద్రంలోకి వెళ్లనీవ్వకుండా పహారా కాస్తున్నారు. తూపిలిపాళెం, కొండూరుపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, పూడిరాయ దొరువు సముద్రతీరంలో 10 మీటర్ల మేర సముద్రం ముందుకురావడంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



స్వర్ణముఖిబ్యారేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తుఫాన్ తీరం దాటనునండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. స్వర్ణముఖి బ్యారేజీని పరిశీలించి, బాలిరెడ్డిపాళెం ముంపు ప్రాంతంలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. బాలిరెడ్డిపాళెం ఎస్టీకాలనీవాసులకు ఆహారం అందజేశారు. అనంతరం తూపిలిపాళెం సముద్రతీరంలో అలల ఉధృతిని పరిశీలించి మత్స్యకారులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. ఆయనతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, టీడీపీ నాయకుడు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

7 సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనేపల్లి దళితవాడలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల సమాచారం మేరకు... పాకం వీరయ్య, సుభద్ర దంపతులు మాంబట్టు పారిశ్రామికవాడలోని అపాచి బూట్ల కర్మాగారంలో పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం భార్య, భర్తలిద్దరూ ఇంటికి తాళం వేసి కంపెనీకి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి 7 సవర్ల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి గోపి నాయక్

బాలాయపల్లి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మోంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి గోపి నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని నిండలి, రామాపురం వద్ద ఉన్న కైవల్యా నది బ్రిడ్జి వరద ప్రవాహాన్ని అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. వంతెనల వద్ద ఎలాంటి ప్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఎస్‌ఐ గోపీ, ఏవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరసింహారావు, మండల ప్రత్యేక అధికారి రమేష్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కాగా, పట్టణంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వరకు 4 సెంటీమీటర్లు వర్షం కురిసిందని అధికారులు తెలిపారు.

గిరిజనులకు టీడీపీ నేతల సాయం



కేశవరంలోని నక్కలోళ్లకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులకు గురైన గిరిజనులకు టీడీపీ నాయకులు సాయం అందించారు. కేశవరం పంచాయతీ పరిధిలో ఉన్న నక్కలోళ్ల కాలనీలో 500మందికి చిట్టేడు సహకార సంఘం చైర్మన్ చాపల శ్రీనివాసులు, టీడీపీ బూత్ కన్వీనర్ కోకోలు భూపతి దాతృత్వంతో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, కోటమ్మగుడి కాలనీల్లోని గిరిజనులకు జలీల్ అహ్మద్ దాతృత్వంతో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు షంషుద్దీన్, సురేష్, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్, నౌషాద్‌బాషా, తిరుమలశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని గురవయ్య(38) మృతి చెందాడు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం కొత్తపాళెం గ్రామానికి చెందిన గురవయ్య విజయవాడకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాయుడుపేటలో దిగాడు. విన్నమాల వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గురవయ్య మృతి చెందాడు. ఆయన భార్య సుఖన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

ఎడతెరపిలేని ముసురు



ఓజిలి: మామిడికాలువను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, అధికారులు

తడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి ముసురు పట్టినట్లుగా వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం వరకు ముసురు కొనసాగింది. దీనికి చలి గాలులు తోడవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. తడ మండలంలో కరిపేటి కాలువ, పాముల కాలువ నిండుగా ప్రవహిస్తున్నాయి. ముందస్తు చర్యల్లో భాగంగా 9 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెరియవట్టు దళితవాడ ప్రజలకు ఆహార పొట్లాలను సరఫరా చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇక కాళంగి నదికి గత ఏడాది వాటంబేడు వద్ద పడిన గండిని ఇసుక బస్తాలతో పూడ్చివేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ముంపు ప్రాంతాలైన కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, తడ ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. మంగళవారం రాత్రి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వెండ్లూరుపాడు, కాదలూరుల మధ్య రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు. మంగళ, బుధవారాలలో పరిశ్రమలకు సెలవు ప్రకటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలాగే మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు జాతీయ రహదారుల్లో ప్రయాణిస్తున్న కంటైనర్ వంటి భారీ వాహనాలను ఎక్కడికక్కడ నిలిపివేస్తున్నట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు.

సూళ్లూరుపేట: పట్టనంలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వాతావరణం నెలకొంది. అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధికారులతో కలిసి ఇలుపూరు - మంగళంపాడు మధ్యనున్న దొండ కాలువను పరిశీలించారు. దొండకాలువ వంతెనపై రెండు అడుగుల మేర నీరు పారుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత గ్రామాల్లో పునరావాస కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తుఫాన్ తీరం దాటి వర్షం ఆగే వరకు అధికారులు అప్రమత్తం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మా నాయుడు, టీడీపీ నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, మాధవ నాయుడు, సతీష్ పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలో మంగళవారం ఎడతెరపిలేకుండా తేలికపాటి వర్షం కురిసింది. కుంటలు, చెరువులకు పూర్తిస్థాయిలో నిండాయి. పంట పొలాలు చెరువుల్లా మారాయి. కాలువలు, దొరువులు, కలుజులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఓజిలి మండలంలోని మానమాల, ఓజిలి గ్రామాల్లో పర్యటించారు. మానమాలకు సమీపంలోని మామిడికాలువ కాజ్‌వేను పరిశీలించి రాకపోకలు ఆపివేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ పాఠశాల వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ఓజిలి పెద్దచెరువుకు పూర్తిస్థాయిలో నీరు చేరిన నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆర్డీవో వెంట తహసీల్దారు పద్మావతి, అధికారులు ఉన్నారు. కాగా, గ్రద్దగుంటలో గిరిజనవాసులకు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో పునరావాసం కల్పించారు.

దొరవారిసత్రం: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. వర్షాలు ఎక్కువైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావస కేంద్రాలకు తరలించేందుకు తహసీల్దారు శైలాకుమారి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టారు. పులికాట్ తీరంలోని కారికాడు, వేలికాడు, మీజూరు గ్రామాల పాఠశాల భవనాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే పూలతోట, తల్లంపాడు పాఠశాలల్లోనూ పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎస్‌ఐ అజయ్‌కుమార్, ఏఏసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మాధవ్, నాగేంద్ర నాయుడు, అలవల శీనయ్య, తదితరులు ఉన్నారు.

గూడూరు: మొంథా తుఫాన్ ప్రభావంతో పట్టణంలో మంగళవారం వేకువ నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, ఐసీఎస్‌రోడ్డు, అంబేడ్కర్‌నగర్ అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై నిల్వచేరడంతో వాహనదారులు, పాదాచారులు అవస్థలు పడ్డారు. విందూరు, చెన్నూరు గిరిజనకాలనీల్లోని ప్రజలను సమీప పాఠశాలల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. అధికారులు, స్థానిక నేతలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆహార పొట్లాలను అందజేశారు.

చిల్లకూరు: మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. అధికారులు, టీడీపీ నాయకులు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. అలాగే తమ్మినపట్నం, తిక్కవరం, కలవకొండ, ఓడూరు, ఉడతావారిపాళ్లపల్లి గ్రామాల్లోని గిజనకాలనీవాసులను పునరావాస కేంద్రాలకు తరలించారు. తిక్కవరంలో తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి సహకారంతో గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు. ఓడూరులో గుండాల లీలావతి, చిట్టేటి కీరవాణి, ఉడతావారిపాళ్లపల్లి సర్పంచు త్రివిక్రమ్ భూపతి, కుమార్ యాదవ్, బాస్కర్, కలవకొండ నెలటూరు చిరంజీవి, తమ్మినపట్నం సతీష్‌యాదవ్ సహకారంతో ఆయా గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో గిరిజనులకు భోజన సదుపాయం కల్పించారు.

కోట: మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు నిండుతున్నాయి. గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి, మామిడి కాలువ పరవళ్లు తొక్కుతున్నాయి. గూడలి, రాజుపాళెం, వెంకన్నపాళెం, తిన్నెలపూడి, దక్షిణపాలెం గ్రామాల్లో నారుమడులు నీట మునిగిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో మత్స్యకార గ్రామాలైన గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, కొత్తపట్నం, గున్నంపడియ గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలు భయం గుప్పెట్లోనే ఉన్నాయి. శ్రీనివాససత్రం వద్ద సముద్రం భీకర శబ్దాలతో అలల ఉధృతి పెరుగుతుండటంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



దొరవారిసత్రం: తనియాలి కాళంగి నది వంతెన వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తహసీల్దారు జయజయరావు, ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్‌తో పాటు వీఆర్వోలుసముద్రతీరప్రాంత గ్రామాలను సందర్శించారు. గోవిందపల్లివద్ద ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ ఉధృతి, పుచ్చలపల్లి వద్ద ఉన్న స్వర్ణముఖి నది ప్రవాహాలను పరిశీలించి ముంపుగ్రామాలవాసులకు భరోసా ఇచ్చారు.

పెళ్లకూరు: స్వర్ణముఖినది, పాలచ్చూరు కాలువలు, తెలుగుగంగ కాలువలు, వాగులు, కలుజులు పారుతుండడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. పాలచ్చూరు గిరిజన కాలనీకి చెందిన యాకసిరి సునీత, తుపాకుల రంగమ్మకు చెందిన రెండు పూరి గుడిసెలు నేలకూలాయి. స్వర్ణముఖినదికి భారీగా వరదనీరు చేరుతోంది. మండలంలోని చెరువులు, వాగులు, వంకలు, కలుజులు పారుతున్నాయి. తహసీల్దార్ హరికృష్ణ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. కొత్తూరు, కానూరు, మోదుగులపాలెం, పాలచ్చూరు, సవటకండ్రిగ, ముమ్మారెడ్డిగుంట, సవట కండ్రిగ, భీమవరం ఎస్సీ, ఎస్టీ కాలనీలతో పాటు చిల్లకూరు వడ్డిపాలెం బీసీ కాలనీలో పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు. శిరసనంబేడు చెరువు పూర్తిగా నిండి ప్రమాదకరంగా మారడంతో ఇరిగేషన్ డీఈ విశ్వనాథ్, ఏఈ శ్రీనివాసులు ఎక్స్‌కవేటర్‌తో కట్టను తెగ్గొటి నీటిని దిగువకు విడుదల చేశారు. కొత్తూరు గిరిజన కాలనీవాసులను టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య అధికారులతో కలసి పునరావాస కేంద్రాలకు తరలించారు. పాలచ్చూరు ఎస్టీ కాలనీలో కూలిన పూరి గుడిసెలను బీజేపీ నేతలు మునిసుబ్రహ్మణ్యం, ఎద్దల నరేంద్రరెడ్డి పరిశీలించారు. మంగళవారం అర్థరాత్రి తుఫాన్ తీరం దాట నుండడంతో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి ఆర్‌అండ్‌బీ డీఈ మహేశ్వరి తెలిపారు.

నాయుడుపేట: మండలంలో తేలికపాటి వర్షం కురుస్తోంది. మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, మునిరత్నంనగర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, మేనకూరు, పుదూరు, భీమవరం, చిలమత్తూరు, అన్నమేడు, బట్టివిడత, వాసుదేవపురంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాయుడుపేట - మేనకూరు వద్ద మామిడి కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది.



నాయుడుపేట: మేనకూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మామిడి కాలువ







చిల్లకూరు: తిప్పగుంటపాళెం ఉప్పుటేరు చప్టాపై వరద - పెళ్లకూరు: కొత్తూరు గిరిజన కాలనీలో అధికారులు, టీడీపీ నాయకులు - బాలాయపల్లి: నిండలి వద్ద కైవల్యానది బ్రిడ్జిపై నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోతులమయంగా గూడూరు - వేములపాళెం రోడ్డు



గూడూరు బీసీ కాలనీ సమీపంలో వేములపాళెం రోడ్డుకు గోతులు

గూడూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి మండలంలోని వేములపాళెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో 15కు పైగా గుంతలు ఏర్పడి వర్షపునీరు నిల్వ చేరడంతో మడుగులను తలపిస్తున్నాయి. మండలంలోని విందూరు, రామలింగాపురం, సంతదాసుపల్లి, ఈదలపల్లి, మిటాత్మకూరు తదితర గ్రామాల ప్రజలు వివిధ పనులపై గూడూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా వేములపాళెం మీదుగానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అయితే గూడూరు నుంచి వేములపాళెం వెళ్లే రహదారి గోతులమయంగా మారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయానించాలంటే ఇబ్బందికరంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా గూడూరు బీసీ కాలనీ, మల్లితోట వాటర్‌వర్క్స్ ప్రాంతం, మదురెడ్డికాలనీ, వేములపాళెం సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారిందని చెబుతున్నారు. సంబంధింత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలలు కోరుతున్నారు.

రోడ్డంతా గుంతలే



అమ్మపాళెం వద్ద గోతులు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి - గూడూరు రోడ్డు గుంతమయంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే నరకప్రయాణంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు చేరి గుంతలు ఎక్కడ ఉన్నాయో కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా 9వ బెటాలియన్‌లో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమాండెంట్ ఈఎస్‌ఎస్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గోతిలో దిగిన ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం

కోట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కోట మండలం క్రాస్‌రోడ్డులో చల్లకాలువ వంతెన వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సు గోతిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వాకాడు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు సర్వీసు నాయుడుపేట నుంచి ప్రయాణికులతో విద్యానగర్ మీదుగా కోటకు బయలుదేరింది. క్రాస్‌రోడ్డులో చల్లకాలువ వంతెన వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కేబుల్ కోసం తవ్విన గోతిలో దిగి పక్కకు వాలిపోయింది. బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



గుంతలో దిగి పక్కకు ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

గిరిజనులకు ఆహార పొట్లాల పంపిణీ



గిరిజనులకు ఆహార పొట్లాలను అందజేస్తున్న సునీల్‌కుమార్

గూడూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోతట్టు గిరిజన కాలనీల్లో ప్రజలకు ఆహార పొట్లాలను అందించారు. చెన్నూరు గిరిజనకాలనీలోని గిరిజనులను సమీప పాఠశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. వారికి తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి భోజన వసతి కల్పించారు. పోటుపాళెం గిరిజనకాలనీలో గిరిజనులకు విజయ దుర్గాదేవి ఉపపీఠం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆహార పొట్లాలు, గొడుగులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమి షనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని విందూరు ఎస్టీకాలనీ సమీపంలోని పాఠశాలలో ఎస్టీ కాలనీవాసులకు అధికారులు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజనం వసతులను కల్పించారు. ఈ కేంద్రాన్ని తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, డీఎల్‌డీవో వాణి పర్యవేక్షించారు.

రొచ్చురొచ్చుగా మున్సిపాలిటీ రోడ్డు



అడుసులా ఆనందపురం వద్ద రోడ్డు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నుంచి చెలికంపాటు, మన్నెగుంట, కుర్జాగుంట, మన్నవరం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రధానంగా సుభాష్ చంద్రబోస్ సర్కిల్ నుంచి ఆనందపురం వరకు 400మీటర్లు గుంతలమయంగా మారింది. ఇటీవల వర్షాలతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

సూళ్లూరుపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో మున్సిపాలిటీ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య పర్యటించారు. పట్టణంలోని సాయినగర్, ఇందిరాగనగర్, మహదేవయ్య నగర్, ఇసుకమిట్ట, మన్నారుపోలూరు ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌లు, బోర్డులు, ఫ్లెక్సీలను తొలిగించారు.



నెర్రికాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్ రెడ్డి, కమిషనర్ చిన్నయ్య